PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 158 | విజయవాడ, సోమవారం 9 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 9 January 2023 | Rs

పిఎం ఆవాస్ యోజన సగం కూడా పూర్తికాలే..

- నిర్మాణం మొదలుకాని ఇళ్లు గ్రామాల్లో 84 లక్షలు.. పట్టణాల్లో 59 లక్షలు..
- 2022కల్లా అందరికీ పక్కా ఇళ్లు కట్టిస్తామన్న మోడీ సర్కార్
- ప్రతి రాష్ట్రంలోనూ పెద్దఎత్తున ప్రచారం..రాజకీయ లబ్ధి

లోపలి పేజీలో..

రేసు రసవత్తరం

- రెండు బెర్తులు, నాలుగు జట్లు
- ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్

లోపలి పేజీలో..

మాట్లాడుతున్న ముప్పాళ్ళ సుబ్బారావు, సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

భోగి మంటల్లో జిఓ 1

ఫిబ్రవరి మొదటి వారంలో రాష్ట్ర సదస్సు
జిఓ రద్దు చేసే వరకు పోరాటం
ఎపిసిఎల్ఎ రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రహదారులు, కూడళ్ళలో సభలు, ర్యాలీలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నెంబరు1 కాపీలను భోగి మంటల్లో దగ్ధం చేయాలని, ప్రభుత్వం ఆ జీఓను ఉపసంహరించుకునే వరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేయాలని, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎపిసిఎల్ఎ అధ్యక్షులు ముప్పాళ్ల సుబ్బారావు అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి పొత్తూరి సురేష్‌కుమార్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో మేధావులు, రచయితలు, కళాకారులు, మానవహక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలతో కలిసి రాష్ట్ర సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు.. ప్రతి జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు జరపాలని, మేధావులతో కమిటీల ఏర్పాటు చేయాలని, సంక్రాంతి సందర్భంగా భోగి మంటల్లో జిఓ కాపీలను దగ్ధం చేయాలని, జనవరి 26న జాతీయ పతాకాలను ఎగురవేయడం, ప్రదర్శనలు, ప్రతిజ్ఞలు చేయడం, 30న గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహాల వద్ద మౌన దీక్షలు చేయాలని రౌండ్ టేబుల్ నిర్ణయించింది. జిఓ నెంబరు1ని రద్దు చేయాలని కోరుతూ గవర్నర్, జిల్లా స్థాయిల్లో కలెక్టర్, మండలస్థాయిలో తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. రాష్ట్ర కమిటీ కన్వీనర్లుగా ఎపిసిఎల్ఎ రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ల సుబ్బారావు, ఐలు రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ వ్యవహరిస్తారని,. అన్ని ప్రజాసంఘాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిఓ వచ్చిన మరుక్షణమే వైసిపి ఉల్లంఘించిందని, దళితుల మీద దాడులకు నిరసనగా కెవిపిఎస్ ర్యాలీ చేస్తామంటే పోలీసులు అడ్డుకున్నారన్నారు. 1857లో సిపాయిల తిరుగుబాటు జరిగిందని, స్వాతంత్ర్యపోరాటాన్ని అణచివేసేందుకు బ్రిటిష్‌వారు 1861 పోలీసు యాక్ట్‌ను తీసుకొచ్చారని, ఈ చట్టాన్ని జాతీయ లా కమిషన్ తిరస్కరించిందని, సుప్రీంకోర్టు ఆదేశంతో 2006లో నమూనా పోలీసు చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. బ్రిటీష్ చట్టాన్ని జగన్ మనపై రుద్దడాన్ని ప్రతి ఒక్కరూ తిరస్కరించాలన్నారు. పౌర హక్కులను రద్దు చేస్తూ అనేక చట్టాలు,జీఓలు తీసుకొచ్చినా అవి అమలు చేసే పరిస్థితులు ఏ ప్రభుత్వానికి లేవన్నారు. రాజ్యాంగ ఉల్లంఘనలు ఢిల్లీ నుంచి జరుగుతున్నాయన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ జీఓనెంబరు1ని అన్ని సంఘాలు, రాజకీయపార్టీలు , ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. నిరసనలకు కూడా అనుమతినివ్వకపోగా గృహనిర్బంధాలు అంటూ ప్రభుత్వం వింత పోకడలు మిగతా 2లో

పుంజుకోని రబీ

- జనవరి వచ్చినా సగమే సాగు
- తొమ్మిదిన్నర లక్షల ఎకరాల్లో తక్కువ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఈ తడవ రబీ సాగు జనవరి వచ్చినా పుంజుకోలేదు. అక్టోబర్‌లో సీజన్ మొదలుకాగా ఇప్పటికి మూడు మాసాలు గడిచిపోయాయి. అయినా సాగు బాగా నెమ్మదిగా సాగుతోంది. సాధారణ విస్తీర్ణంలో సగమే సాగు నమోదైంది. ఈపాటికి కావాల్సిన సాగులో తొమ్మిదిన్నర లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. ఆహార ధాన్యాలు సైతం సగమే సాగయ్యాయి. ఆ పంటలు కూడా ఇప్పటికి కావాల్సిన సాగులో 9 లక్షల ఎకరాలు తగ్గాయి. జనవరి 4 నాటికి వ్యవసాయ శాఖ విడుదల చేసిన అధికారిక గణాంకాలివి. క్షేత్ర స్థాయిలో సేద్యం ఇంకా తక్కువే జరిగిందని చెబుతున్నారు. రబీలో వరి, పప్పుధాన్యాల సాగు 70 శాతంపైనే. ఆ పంటలు సైతం తక్కువే సాగయ్యాయి. వరి నాట్లు 35 శాతం విస్తీర్ణంలో వేశారు. నిరుటి వలేనే ఈ ఏడాది కూడా రబీలో వరి సాగుపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. మోటార్లు, లిఫ్టులు, బావుల కింద వరి వేయొద్దని ఆదేశించింది.

కృష్ణా డెల్టాలో రెండవ పంటకు నీరివ్వట్లేదు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయమంటున్నారు. దాంతో వరి సాధారణ విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతానికి పెన్నా, గోదావరి కాల్వల కిందనే వరి సాగుకు అనుమతి ఉంది. నెల్లూరు జిల్లాలో వరి సాగు విస్తీర్ణం రాష్ట్రంలోనే అత్యధికం. అక్కడ కూడా ఈ సారి 69 శాతమే నాట్లు పడ్డాయి. పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, తిరుపతి, నంద్యాలలో వరి నాట్లు తక్కువే పడ్డాయి.

పప్పు ధాన్యాలూ అంతే

రబీలో వరి కంటే పప్పుధాన్యాల సాగే ఎక్కువ. అందులోనూ శనగ విస్తీర్ణం అత్యధికం. మొత్తంగా పప్పుధాన్యాలు 65 శాతం సాగయ్యాయి. శనగ 71 శాతం సాగైంది. కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడులో ఒక మేరకు సాగు చేస్తారు. అన్ని చోట్లా నార్మల్ కంటే తక్కువే సాగైంది. ఈపాటికి శనగ పంట సాగు దాదాపు పూర్తవుతుంది. కానీ ఈ సంవత్సరం ఆ పరిస్థితి లేదు. వరికి ప్రత్యామ్నాయంగా కృష్ణా డెల్టాలో మినుము, పెసర్లు సాగు చేస్తారు. ఆ పంటలు సైతం పూర్తి స్థాయిలో సాగు కాలేదు. నంద్యాల, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరంలోనూ మినుము తక్కువే సాగైంది. పెసర ఎక్కువగా సాగయ్యే గుంటూరు, బాపట్ల, పల్నాడు, శ్రీకాకుళం, విజయనగరంలో నార్మల్ కంటే తక్కువ సాగైంది.

నూనెగింజలు సైతం..

మామూలుగా రబీలో నూనెగింజల సాగు తక్కువ. ఆ మేరకు పంటలు సైతం తగ్గాయి. వచ్చే ఖరీఫ్ విత్తన అవసరాల కోసం రబీలో వేరుశనగ పండిస్తారు. ఈ తడవ విత్తన పంట కూడా తగ్గింది. మొత్తమ్మీద నూనెగింజలు 53 శాతం విస్తీర్ణంలోనే సాగయ్యాయి. పొగాకు 68 శాతం సాగైంది.

రబీ పంటల సాగు (లక్షల ఎకరాలు)

పంట	సీజన్ నార్మల్	ఇప్పటికి కావాల్సిన సాగు	సాగైంది
వరి	19.72	10.25	6.95
ముతక ధాన్యాలు	8.17	5.07	3.85
పప్పు ధాన్యాలు	24.00	20.01	15.57
ఆహార ధాన్యాలు	51.90	35.45	26.37
నూనె గింజలు	3.47	1.82	1.85
మొత్తం	57.30	38.82	29.50

మాచర్లలో టెన్షన్ టెన్షన్

- సంతకాలు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు హాజరైన టిడిపి నేత బ్రహ్మారెడ్డి

లోపలి పేజీల్లో..

పరస్పర సహకారం

- ఆపి, ఎపి వైద్య, ఆరోగ్య శాఖ మధ్య ఒప్పందం
- విశాఖలో ముగిసిన గ్లోబల్ హెల్త్ సమ్మిట్

ఉగ్రవాద జాబితాలో

మరో రెండు సంస్థలు

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపించేందుకు కార్యకలాపాలు నిర్వహిస్తున్న రెండు సంస్థలను, నలుగురు వ్యక్తులను ఉగ్రవాద జాబితాలో చేరుస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఆ సంస్థల, వ్యక్తుల పేర్లను గత నాలుగు రోజులుగా వేర్వేరు ప్రకటనల్లో ఎంహెచ్ఎ పేర్కొంది. లష్కరే తోయిబాకు అనుబంధంగా పాకిస్థాన్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్), పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ అనుబంధ సంస్థ పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ (పిఎఎఫ్ఎఫ్)లు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. ఉగ్రవాదులుగా పేర్కొన్న వారిలో టిఆర్ఎఫ్‌కు చెందిన షేక్ సజ్జాద్ గుల్, లష్కరే తోయిబా కమాండర్ మహ్మద్ అమిన్ కుబాబ్, అదే సంస్థకు చెందిన అర్బాజ్ అహ్మద్ మిర్, కాశ్మీరీ యువతను రెచ్చగొడుతున్న అసిఫ్ మక్బూల్ దర్ ఉన్నారు. వీరిలో అర్బాజ్ అహ్మద్ మిర్ కొందరిని లక్ష్యంగా చేసుకుని హత్య చేస్తున్నట్లు ఎంహెచ్ఎ పేర్కొంది. కొన్ని నెలల క్రితం కుల్గాంలో టీచర్ రజిని బాల హత్య కేసులో కుట్రదారుగా తెలిపింది.

జగన్‌ది నిరంకుశ పాలన

- చీకటి జిఒను ఉపసంహరించే వరకు పోరాటం
- విలేకరుల సమావేశంలో చంద్రబాబు, పవన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో జగన్ నిరంకుశ పాలన సాగిస్తున్నారని ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ఆయనతో సమావేశమయ్యారు. సుమారు రెండు గంటల పాటు వీరిద్దరి భేటీ కొనసాగింది. అనంతరం చంద్రబాబు, పవన్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలను అణచివేసేందుకు తీసుకొచ్చిన జిఒ నంబర్-1ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వం దిగివచ్చి, జిఒను ఉపసంహరించేంతవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ పోరాటంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలిసి పోరాడాలన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదనే ఉద్దేశంతోనే బ్రిటీష్ కాలంనాటి చీకటి జిఒను ఇప్పుడు తీసుకొచ్చారని వారు విమర్శించారు.కందుకూరు, గుంటూరుల్లో జరిగిన ఘటనలకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులే కారణమని చంద్రబాబు ఆరోపించారు. ఎమర్జెన్సీ కంటే భయంకరమైన పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. ఎంత భయపెట్టినా తమ మనోనిబ్బరాన్ని దెబ్బతీయలేరని అన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాలపై ఎలా పోరాడాలనే దానిపైనే పవన్ కల్యాణ్‌తో చర్చించినట్లు చంద్రబాబు తెలిపారు.. 'విశాఖలో ఆంక్షలు పేరుతో పవన్ కల్యాణ్‌ను హింసించారు. ఇప్పటంలో అక్కడి ప్రజలకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లినా అలాగే చేశారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తే టిడిపి ఆఫీసుపై దాడి జరిగినా పోలీసులు స్పందించలేదు. నా సొంత నియోజకవర్గం కుప్పం వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.' అని అన్నారు. వైసిపి ప్రభుత్వ అరాచకాలపై అవసరమైతే కేంద్రానికి, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఎన్నికల పొత్తుల గురించి అడిగిన ప్రశ్నకు ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయ పార్టీలు సజావుగా కార్యకలాపాలు సాగించగలిగితే ఆ తర్వాత ఎన్నికలు, పొత్తులపై మాట్లాడొచ్చని చెప్పారు

పవన్‌కల్యాణ్‌పై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలపై మీడియా పదేపదే వివరణ కోరగా చంద్రబాబు ఒకింత అసహనానికి గురయాయరు. అప్రజాస్వామ్య విధానాలను ప్రశ్నించే బాధ్యత మీకు లేదా? అంటూ విలేకరులను ఎదురు ప్రశ్నించారు. అంతకుముందు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అరాచకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లు, శాంతిభద్రతలు తదితర అంశాలపై చర్చించామని తెలిపారు. ప్రజల వద్దకు వెళ్లనీయకుండా ప్రతిపక్ష నేతలను నియంత్రించేందుకే చీకటి జిఒ తెచ్చారని విమర్శించారు. ప్రభుత్వ దుందుడుకు చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు అనుసరించాల్సిన అంశాలపై చర్చించామని తెలిపారు. 'శాంతి భద్రతల పర్యవేక్షణ పోలీసుల బాధ్యత కాదా? మా సమావేశాలకు మా లాఠీలు మేమే పట్టుకోవాలా? అలాంటప్పుడు ప్రభుత్వాలు, పోలీసు మిగతా 2లో

విలేకరులతో మాట్లాడుతున్న చంద్రబాబు, పవన్

ఆవాజ్ మహాసభ సందర్భంగా సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ చంద్ర కుమార్

మతం కాదు... మానవత్వం కావాలి

సదస్సులో జస్టిస్ చంద్రకుమార్
బిజెపి పాలనలో మైనార్టీలకు, దళితులకు భద్రత కరువు
ఉత్సాహంగా ఆవాజ్ రాష్ట్ర మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి- గుంటూరు

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మతం పేరుతో ఇంతటి విద్వేషం ఎన్నడూ చూడలేదని, ఈ ప్రమాదకర పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత లౌకిక, ప్రజాస్వామ్య వాదులందరిపై ఉందని ఆంధ్రప్రదేశ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. మతాలను పక్కనపెట్టి మానవత్వాన్ని పెంపొందించాలని కోరారు. ఆవాజ్ రాష్ట్ర రెండో మహాసభ ప్రారంభం సందర్భంగా 'భారత రాజ్యాంగం - లౌకికవాద పరిరక్షణ' అనే అంశంపై సదస్సు జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ఎవరి మతాన్ని వారు, ఎవరి సంస్కృతిని వారు అనుసరించే హక్కును కల్పించిందని తెలిపారు. కానీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. సమస్యల నుండి ప్రజలను పక్కదారి పట్టించేందుకు ముస్లిముల పట్ల ద్వేషాన్ని పెంచేందుకు మతోన్మాద విధానాలు తెరపైకి తెస్తోందన్నారు. మైనార్టీలపై, పిల్లలపై, మహిళలపై దాడులు చేయాలని ఏ మతం చెప్పిందని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని, ముస్లిములను, కమ్యూనిస్టులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. నిజమైన దేశద్రోహులు ఎవరు, నిజమైన దేశభక్తులు ఎవరో ప్రజలు గుర్తించాలని, మతోన్మాదుల విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి గెలుపునకు పరోక్షంగా సహకరిస్తూ మైనార్టీల గురించి మాట్లాడే పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సదస్సులో ప్రారంభోపన్యాసం చేసిన ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ బిజెపి పాలనలో మైనార్టీలకు, దళితులకు భద్రత కరువు, ఎనిమిదేళ్ల పాలనలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీ వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని తెలిపారు. దేశంలో బిజెపికి ఉన్న 4026 మంది ఎమ్మెల్యేలు, ఎంపిలలో ఒక్కరు కూడా ముస్లిం లేకపోవడం ఆ పార్టీకి ముస్లిములపై ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఇదేనా ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. 370 అధికరణ రద్దు చేశారని, మతం ఆధారంగా పౌరసత్వం ఇస్తామంటున్నారని, ముస్లిముల పౌరసత్వం రద్దు చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ చిష్టీ అధ్యక్షతన జరిగి ఈ సదస్సులో ఆవాజ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్, బ్రైట్ హారిజన్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ చాంద్ బాషా, ముస్లిం ఐక్యవేదిక నాయకులు జియావూర్ రెహ్మాన్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు కె.నళినీకాంత్, అవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.భాషా, ఎస్ఎకె జిలానీ తదితరులు ప్రసంగించారు.

సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులు కాగితాలకే పరిమితం : ఆవాజ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్

సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులను అమలు చేసి ముస్లిముల సంక్షేమానికి కృషి చేయాలని ఆవాజ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్ డిమాండ్ చేశారు. రెండ్రోజులపాటు జరగనున్న ఆవాజ్ రాష్ట్ర రెండో మహాసభ గుంటూరులోని లాల్‌జాన్‌బాషా షాదిఖానాలో ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. తొలుత ఆవాజ్ జెండాను సీనియర్ నాయకులు ఇక్బాల్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో గఫూర్ మాట్లాడుతూ ముస్లిముల మిగతా 2లో

మిర్చిపై 'నల్లి' దాడి

- కళ్ల ముందే పంట దెబ్బతింటుండడంతో రైతులు కన్నీరుమున్నీరు
- దున్నేయడం తప్ప వేరే దారి లేదంటూ ఆవేదన

లోపలి పేజీలో..

వస్త్ర వ్యాపారం కుదేలు

- విజయనగరం టెక్స్‌టైల్స్ మార్కెట్‌పై కార్పొరేట్ దెబ్బ
- పోటీని తట్టుకోలేక విలవిలలాడుతున్న వ్యాపారులు

లంబసింగిలో 1.5 డిగ్రీలు

- కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రత

ప్రజాశక్తి- సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఏజెన్సీ ప్రాంతంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి పులికి ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఆంధ్రా కాశ్మీర్‌గా పేరుగాంచిన లంబసింగిలో ఆదివారం ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల కనిష్ట స్థాయిలో నమోదైంది. జికె.వీధి మండలం సీలేరులో గరిష్ట ఉష్ణోగ్రత 29 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత ఏడు డిగ్రీలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. సీలేరు, చింతపల్లి, లంబసింగి పరిసర ప్రాంతాల్లో అధికంగా మంచు కురిసి చల్లటి గాలులు వీయడంతో చలి తీవ్రత మరింత అధికమైంది. తెల్లవారుజామున అధికంగా మంచు కురిసింది. ఉదయం తొమ్మిది గంటల వరకూ మంచు తెరలు వీడడం లేదు. సీలేరు పరిసర ప్రాంతాలతోపాటు ఎపి జెన్‌కో కాలనీ, మార్కెట్ సెంటర్‌లో అధికంగా మంచు కురుస్తుండడంతో రోడ్లపై సంచరించేందుకు జనం సాహసించడం లేదు. చలి తీవ్రత వల్ల ఆదివారం దుకాణాలు ఆలస్యంగా తెరుచుకున్నాయి. వారం రోజుల క్రితం వరకు చలి, మంచు తీవ్రత అంతంత మాత్రంగా ఉండేది. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో మంచు తీవ్రతతో పాటు చలి అధికమైంది. సీలేరు నది పరివాహక ప్రాంత ప్రజలతోపాటు ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని గిరిజన గ్రామాల ప్రజలు చలికి తాళలేక మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

'మైలాన్'లో అగ్ని ప్రమాదం

- ముగ్గురు కార్మికుల మృతి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

పరిశ్రమలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని మైలాన్ యూనిట్-1 పరిశ్రమలో ఆదివారం జరిగింది. బొల్లారం సిఐ సురేందర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మైలాన్ యూనిట్-1 పరిశ్రమలోని వేర్‌హౌస్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళానికి చెందిన లోకేశ్వర్‌రావు (38) అసిస్టెంట్ మేనేజర్‌గా, పశ్చిమబెంగాల్‌కి చెందిన పరితోష్ మెహతా (40), బీహార్‌కు చెందిన రంజిత్ కుమార్ (27) కార్మికులుగా పనులు చేస్తున్నారు. టెట్రా మిథైల్ డిసిలోక్సిన్ అనే రా మెటీరియల్‌ను భద్రపరుస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. తీవ్ర గాయాలపాలైన వారిని వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు.

గ్రూప్-1కు 82.38 శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్‌సి) నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 82.38 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాష్ట్రంలో 18 చోట్ల 297 పరీక్ష కేంద్రాలను ఎపిపిఎస్‌సి ఏర్పాటు చేసింది. మొత్తం 1,26,229 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,06,473 మంది హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటలకు జరిగిన పేపర్-1కు 87,718 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరిగిన పేపర్-2 పరీక్షకు 87,331 మంది హాజరయ్యారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

జనసేన చంద్రబాబు కోసం పుట్టిన పార్టీ

- అంబటి రాంబాబు విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన అనేది టిడిపి అధినేత చంద్రబాబు కోసం పుట్టిన పార్టీ అని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాన్ భేటీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాదని, కేవలం టిడిపి పరిరక్షణ కోసమేనని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబుకు కష్టం కలిగినప్పుడు పవన్ ప్యాకేజీ తీసుకుని రక్షించడానికి ప్రయత్నం చేస్తాడన్నారు.

వైసిపికి వణుకెందుకు? : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తమ పార్టీ అధినేత చంద్రబాబును కలిస్తే వైసిపికి వణుకెందుకని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఇద్దరూ కప్పు కాఫీ తాగితే అధికార పార్టీ నేతలు భయంతో మూడు చెరువుల నీళ్లు తాగిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరి కలయికతో ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతమవుతుందనే వైసిపిలో వణుకు ప్రారంభమయిందని అచ్చెన్న విమర్శించారు. ఏడుగురు మంత్రుల చేత పచ్చి అబద్ధాల ప్రకటనలు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఢిల్లీ పోలీసులపై నైజీరియన్ల దాడి..

న్యూ ఢిల్లీ : ఢిల్లీ పోలీసులపై నైజీరియన్లు దాడి చేశారు. వీసా గడువు ముగియడంతో ముగ్గురు నైజీరియన్‌లను యాంటీ డ్రగ్స్ ఫోర్స్ ద్వారా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా వందమందికి పైగా వచ్చి, వారిని విడుదల చేయాలంటూ పోలీసులపై వాగ్వాదానికి దిగి దాడి చేసే ప్రయత్నం చేశారు. నార్కోటిక్స్ సెల్ టీమ్ శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు నెబ్ సరాయ్‌లోని రాజు పార్క్‌కు వెళ్లి ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. వంద మందికి పైగా ఆఫ్రికన్ల గుంపు పోలీసులను చుట్టుముట్టి, వారి ఆపరేషన్‌ను అడ్డుకుంది. ఈ గందరగోళ సమయంలో ముగ్గురు నిందితుల్లో ఇద్దరు తప్పించుకున్నారు. అయితే పోలీసులు 22 ఏళ్ల ఫిలిప్ అనే వ్యక్తిని పట్టుకోగలిగారు. ఈ ఘటనను స్థానికులు వీడియో తీశారు. అరెస్ట్ జరుగుతున్న సమయంలో 150-200 మంది వచ్చి, నిందితులను విడిపించేందుకు యత్నించారని పోలీసులు తెలిపారు. నిందితులను దేశ బహిష్కరణ చేయడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

మరోసారి బద్ధలైన కిలాయుయా అగ్నిపర్వతం..

హవాయి : స్థానిక కిలాయుయా అగ్నిపర్వతం మళ్లీ బద్ధలైంది. జనవరి 5 నుండి ఈ అగ్నిపర్వతం బద్ధలవుతూనే ఉంది. గత నవంబర్ లో దీనికి సమీపంలోనే ఉన్న 'మౌనాలోవా' అగ్ని పర్వతం పేలిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'కిలాయుయా' అగ్నిపర్వతం నుంచి లావా ఎగిసిపడుతోంది. భూమిపై ప్రస్తుతం అత్యంత చురుకుగా ఉన్న అగ్నిపర్వాతాల్లో కిలాయుయా ఒకటి.

హవాయిలోని వాల్కానో నేషనల్ పార్క్ లోని కిలాయుయా జనవరి 5న విస్ఫోటనం చెందడం ప్రారంభించింది. అగ్నిపర్వత శిఖరం వద్ద లావా ప్రవహిస్తోందని.. అగ్నిపర్వతం విస్ఫోటనం కావచ్చని గురువారం యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే హెచ్చరించింది. ప్రపంచంలోనే అతిపెద్ద అగ్ని పర్వతం అయిన మౌనాలోవా నవంబర్ 7,2022న, 38 ఏళ్ల తరువాత తొలిసారి పేలింది. రెండు వారాల పాటు అగ్నిపర్వతం నుంచి లావా ఎగిసిపడింది. ప్రస్తుతం కిలాయుయా గతేడాది ఏప్రిల్‌లో విస్ఫోటనం చెందింది. ఆ ఏడాది ఆగస్టు వరకు ఇలాగే పేలుళ్లు సంభవించాయి.

విద్య..మేధావులను తయారు చేయాలి

- నిరంకుశత్వం, రాచరికం పెంచేదిగా ఉండకూడదు
- కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత చంద్రశేఖర్ రెడ్డి
- గ్రంథాలయాలు, విద్య ప్రజాసంస్కృతిపై సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచ మేధావులను తయారుచేసే విధంగా విద్యావిధానం ఉండాలని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, ప్రొఫెసర్ ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ప్రజావికాస వేదిక ఆధ్వర్యంలో 'గ్రంథాలయాలు, విద్య, ప్రజాసంస్కృతి' అనే అంశంపై మాకినేని బసవపున్నయ్య కేంద్రంలో ఆదివారం సదస్సు జరిగింది. రావి శారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'విద్య, గ్రంథాలయోద్యమం' అంశంపై రాచపాళెం మాట్లాడారు. కాలం చెల్లిన భావాలను కేంద్రప్రభుత్వం నూతన విద్యావిధానంలో తీసుకొస్తుందన్నారు. ప్రపంచ దేశాలు సాధిస్తున్న ప్రగతికి అనుకూలంగా పాఠ్యపుస్తకాలు ఉండాలని తెలిపారు. వేదాల్లో ఉన్న గణితాన్ని, జ్యోతిష్య కోర్సులను విద్యావిధానంలో ప్రవేశపెట్టి దేశాన్ని ఏం చేయదలుచుకున్నారని ప్రశ్నించారు. అశాస్త్రీయమైన భావజాలాన్ని ప్రజల మెదళ్లకు ఎక్కించి, ప్రశ్నించే తత్వాన్ని లేకుండా చేయాలనే భావిస్తున్నారని విమర్శించారు. ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. విద్యారంగంలో కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ ప్రవేశించిన తరువాత విద్య విలువలు మారిపోయాయని, తెలుగుభాషకు ఇవి ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. స్వతంత్ర ఉద్యమంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయని చెప్పారు. ప్రస్తుతం గ్రంథాలయాల్లో వ్యాపార సాహిత్యం ఎక్కువగా, ప్రజాసాహిత్యం తక్కువగా ఉంటోందన్నారు. ప్రజలు జ్ఞానం వైపు ప్రయాణించే పుస్తకాలు ఉండాలని కోరారు. 'ప్రజాసంస్కృతి- పునర్వికాసం' అనే అంశంపై తెలకపల్లి రవి మాట్లాడుతూ మానవీయ స్పృహ, మనిషిని కార్యాచరణకు పురికొల్పే ప్రజాసంస్కృతిపై దాడి జరుగుతోందని అన్నారు. మతతత్వం, కార్పొరేట్ తత్వం అనే పెద్ద సమస్యను ప్రజాసంస్కృతి ఎదుర్కొంటోందని తెలిపారు. దేశ చరిత్రను తిరగరాసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అభ్యుదయ, ప్రగతిశీల భావజాలంపై దాడి జరుగుతోందన్నారు. సుప్రీంకోర్టు చిన్న కేసులతో సమయం వృధా చేస్తోందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అన్న మాటలకు పౌర స్వేచ్ఛను కాపాడటం కంటే పెద్ద కేసు ఉండదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అన్నారని తెలిపారు. దేశంలో స్వేచ్ఛ, స్వంతత్రాలపై దాడి జరుగుతుందని చెప్పడానికి ఇది ఉదాహరణగా చెప్పవచ్చునని పేర్కొన్నారు. కళలు, సంస్కృతి వ్యాప్తి చెందటంలో గ్రంథాలయాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని, సమాజంలో విజ్ఞానాన్ని సమానంగా అందించే వేదికలు అన్నారు. మూఢ విశ్వాసాలు-విజ్ఞాన శాస్త్రం అనే అంశంపై ప్రొఫెసర్ రామచంద్రయ్య మట్లాడుతూ సైన్స్‌ను వాడుకుంటునే దానిపై దాడి చేస్తున్నారని చెప్పారు. మూఢత్వం అనేది మానవళి అభివృద్ధిని అడ్డుకుంటుందన్నారు. సైన్స్ పరిశోధనలకు కేటాయిచే బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. సదస్సుకు అధ్యక్షత వహించిన రావి శారద మాట్లాడుతూ గ్రంథాలయాలను పట్టించుకునే వారు లేరని ఆందోళన వ్యక్త చేశారు

బలవంతంగా ఏకరూప నినాదం: ఎంవిఎస్ శర్మ

ఒకే దేశం ఒకే పన్ను, ఒకే బాష అనే ఏకరూప నినాదాన్ని దేశభక్తి పేరుతో కేంద్రంలో ఉన్న పాలకులు బలవంతంగా రుద్దుతున్నారని ఎంవిఎస్ శర్మ అన్నారు. ఈ నినాదం సరైంది కాదని చెప్పాలని కోరారు. ప్రముఖ విద్యావేత్త రమేష్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన రెండో సెషన్‌లో 'భారతదేశంలో బహుళత్వం-జాతీయ సమైక్యత' అనే అంశంపై ఎంవిఎస్ శర్మ మాట్లాడారు. మత,కుల, ప్రాంతీయ తత్వాలను పనిగట్టుకొని రెచ్చగొట్టి ప్రజలను చీలగొట్టాలని రాజకీయ నాయకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. బహుళత్వం దేశ సుంసపన్నకు, వైవిధ్యానికి నిదర్శనమన్నారు. దేశంలో ఉన్న భిన్నత్వాన్ని, బహుళత్వాన్ని ఏకం చేసుకుంది ప్రజలన్నారు. ప్రజలు కలిసి మెలిసి జీవించడం సహజ స్వభావమని, దీనిని పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజాస్వామ్యం, రాజకీయాలు, రాజ్యాగం అనే అంశంపై పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలు, ఆదర్శలపై దాడి జరుగుతున్నాయని అన్నారు. ఎనిమిదేళ్లుగా రాష్ట్రాల హక్కులను పూర్తిగా హరించడం, రాష్ట్రాల జాబితాలోని ఆక్రమణ చేయడం కళ్ల ముందు కనపడుతోందన్నారు. జిఎస్టి, నోట్లరద్దు, నూతన విద్యావిధానం వంటి అంశాలపై రాష్ట్రాలతో కేంద్రప్రభుత్వం సంప్రదించలేదన్నారు. ఆశ్రిత పెట్టుబడీదారి విధానం వచ్చిన తరువాత వ్యాపార వేత్తలే రాజకీయనాయకులు ప్రజాప్రతినిధులుగా ఉంటున్నారని, ఇది చాలా ప్రమాదకరమన్నారు.'లౌకికవాదం-నేటి సవాళ్లు' అనే అంశంపై ప్రొఫెసర్ ఎన్ అంజయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకులు ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని చెప్పారు. రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం చట్టంగా రూపొందించకపోయినా విద్య వ్యాపారీకరణకు ఉన్న ఆటంకంగా ఉన్న నిబంధనలను తొలగించే ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ప్రొఫెసర్ బి జమీందారి వందన సమర్పణ చేశారు.

జోషిమఠ్ ఒక్కటే కాదు.. నైనిటాల్, ఉత్తరకాశీలకు పొంచి ఉన్న ప్రమాదం

జోషిమఠ్ : దేశంలో ప్రస్తుతం కుంగిపోతున్న జోషిమఠ్ పట్టణం పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఉత్తరాఖండ్ రాష్ట్రం హిమాలయ పర్వతాల్లో ఉన్న ప్రముఖ పట్టణాల్లో జోషిమఠ్ ఒకటి. కొన్ని రోజులుగా జోషిమఠ్ అనూహ్యంగా కుంగిపోతోంది. ఇళ్లు, రోడ్లకు బీటలు వారుతున్నాయి. భౌగోళిక పరిస్థితులు, వాతావరణం ఈ పట్టణానికి ప్రమాదాలుగా మారాయి. ఇలా భూమిలో కూరుకుపోవడం ఒక్క జోషిమఠ్ కు మాత్రమే పరిమితం కాలేదని.. రానున్న రోజుల్లో నైనిటాల్, ఉత్తరకాశీలకు కూడా ప్రమాదం పొంచి ఉందని నిపుణులు చెబుతున్నారు. హిమాలయాల దిగువన ఉన్న అనేక పట్టణాలు కూడా నేలలో కూలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూమి స్వభావంతో సంబంధం లేకుండా ఈ మధ్యకాలంలో హిమాలయ పట్టణాల్లో విపరీతంగా ఇళ్ల నిర్మాణాలు పెరిగాయి. దీనికితోడు ప్రకతి పరిణామాలు, వాతావరణం కూడా ఈ పట్టణాల లైఫ్ ను తగ్గిస్తున్నాయి. విపరీతంగా కురుస్తున్న వర్షాలు, వరదల కారణంగా అక్కడ బలహీనమైన భూమి కోతకు గురవుతోంది. ఈ ప్రాంతంలో భూమి అంతర్భాగంలో టెక్టానిక్ ప్లేట్ల కదలికలు ఎక్కువగా ఉన్నాయి. ఇండియన్ టెక్టానిక ప్లేట్, యూరేషియన్ టెక్టానిక్ ప్లేట్ ను ప్రతీ ఏడాది ఒక సెంటీమీటర్ ముందుకు నెడుతోంది. లక్షల ఏళ్ల క్రితం ఈ టెక్టానిక్ ప్లేట్ల యాక్టివిటీ కారణంగానే ఇప్పుడున్న హిమాలయాలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలోనే ఉత్తరాఖండ్ లోని పలు పట్టణాలు ఉన్నాయి. మెయిన్ సెంట్రల్ థ్రస్ట్(ఎంసీటీ-2) కారణంగా భూమి అస్థిరంగా ఉంది. 2016 నివేదిక ప్రకారం ఈ పట్టణంలోని కొన్ని ప్రాంతాలో కొండచరియలు విరిగిపడిన శిథిలాలపై నిర్మితం అయి ఉంది. నైనిటాల్ పట్టనం షెల్, స్లేట్ లతో కూడిన సున్నపురాయిని కలిగి ఉంది. ఈ రాళు తక్కువ బలాన్ని కలిగి ఉంటాయి. ఇప్పుడు జోషి మఠ్ లో చూస్తున్నదే నైనిటాల్, ఉత్తరకాశీ, చంపావల్ లో జరిగే ఆస్కారం ఉందని వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియాలజీ, గ్రాఫిక్ ఎరా హిల్ యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు.

ఉత్సాహంగా 'రంగరాయ' 1997 బ్యాచ్ ఆత్మీయ కలయిక

- స్నేహితులతో కలసి సందడి చేసిన మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- కాకినాడ

కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో 1997 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఉత్సాహంగా జరిగింది. రంగరాయ వైద్య కళాశాలలో వైద్య విద్యనభ్యసించిన రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు హాజరయ్యారు. స్నేహితులతో కలిసి జోకులు వేసుకుంటూ సందడి చేశారు. కాలేజీ ప్రాంగణంలో తోటి స్నేహితులతో ఫొటో సెషన్‌లో, రంగరాయ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వైబ్రేంట్ కల్చర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డిఎస్‌విఎల్.నరసింహంను పూర్వ విద్యార్థులతో కలిసి మంత్రి సన్మానించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తోటి స్నేహితులు డాక్టర్ శ్రీనివాస్ వీర్రాజు, డాక్టర్ కిషోర్ కుమార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం డాక్టర్ ఆదిత్య తన తండ్రి ఎవి.రెడ్డినాయుడు జ్ఞాపకార్థం అనాటమీ తరగతి గదిలో ఏర్పాటు చేసిన డిజిటల్ బ్లాక్ బోర్డును మంత్రి ప్రారంభించారు.

ప్రిన్సిపల్‌ను సత్కరిస్తున్న మంత్రి సిదిరి అప్పలరాజు

ఇంధన సామర్థ్యంలో మోడల్‌గా ఏపి

- బిఇఇ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన సామర్థ్యంలో ఆంధ్రప్రదేశ్‌ను నమూనాగా ఆవిష్కరిస్తామని బిఇఇ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే అన్నారు. ఇంధన పొదుపు, సమర్ధ వినియోగం, సామర్థ్యం పెంపు అంశాలపై ఆదివారం అన్ని రాష్ట్రాల ఇంధన శాఖ అధికారులతో వెబినార్ ద్వారా సమీక్షించారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాలు అమలులో అత్యుతమ రాష్ట్రాల్లో ఎపి ఒకటని కొనియాడారు. బిఇఇకి చెందిన ఆర్థిక సాంకేతిక నిపుణులతో కూడిన ఫెసిలిటేషన్ సెంటర్ గుర్తించిన రూ.412 కోట్లకు పైబడిన పెట్టుబడులకు ఆస్కారం ఉన్న ప్రాజెక్టులను దశలవారీగా సాకారం చేస్తామన్నారు. 2030 నాటికి 150 మిలియన్ టన్నుల చమురు సమానమైన ఎంటిఓఇను అన్ని రాష్ట్రాలు త్వరిగతిన ఆదా చేయాలని చెప్పారు.

జాతీయ లక్ష్యాలను అందుకునేలా ప్రతి రాష్ట్రం తమకు నిర్దేశించిన ఇంధన సామర్థ్య కార్యక్రమాలను చేరుకునేందుకు ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల ఉమ్మడి ప్రయత్నాలు వల్ల పెర్ఫార్మ్, అచీవ్, ట్రేడ్(పాట్) పథకం ద్వారా రూ.40,945కోట్ల ఇంధన ఆదా చేశారని తెలిపారు. కర్బన ఉద్గారాల తగ్గింపు కోసం ఇంధన పొదుపు, సామర్థ్య కార్యక్రమాల అమలు, అవగాహనలపై రాష్ట్రప్రభుత్వం నిరంతరం దృష్టిసారిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ సంస్థ అధికారులు భాక్రేకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిఇఇ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్, సెక్రటరీ ఆర్‌కే రాయ్, డైరెక్టర్లు మిలింద్ డియోర్, సౌరభ్ దిద్ది తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో జిఓ1

(మొదటి పేజీ తరువాయి)

అవలంభిస్తుందని అన్నారు. మచిలీపట్నం మాజీ ఎంపి, టిడిపి నాయకులు కొనకళ్లనారాయణ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాడే వారి గొంతు నొక్కేందుకే జగన్‌మోహన్‌రెడ్డి జీఓ నెంబరు1ని తెచ్చారన్నారు. పాలకులు తీసుకొచ్చిన నిరంకుశ జీఓనెంబరు1ని ఉప సంహరించుకునే వరకు రాజీలేని పోరాటం చేయాలన్నారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ నల్ల జీఓలను వ్యతిరేకిస్తూ కోర్టులో పోరాటం చేస్తూనే మరో వైపు ప్రజాపోరాటాలను చేయాలన్నారు. ఐలు అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సభలకు తప్ప ప్రదర్శనలకు జిఓ ఆటంకాదని కొందరు వాదిస్తున్నారని, ప్రశ్నించే గొంతులు ప్రజాస్వామ్యానికి అవసరమన్నారు. గాంధీ దండి ఉప్పుసత్యాగ్రహం చేశారని, అవి అన్నీ వీధి పోరాటాలేనన్నారు. వీధులే వేదికలైన పరిస్థితులు పలు సందర్భాల్లో వెల్లడయ్యాయన్నారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి పోతిన మహేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకవచ్చిందని గ్రహించి ప్రజల కోసం పోరాడే వారి గొంతులను నొక్కేందుకు జీఓనెంబరు1ని తెచ్చారన్నారు. జైభీమ్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గం చర్యలు నిలువరించేందుకు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్-న్యూడెమోక్రసీ) నాయకులు పోలారి, ఎంసిపిఐ(యు) నాయకులు సయ్యద్ సలీం, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఎఐటియుసి నాయకులు ఓబులేషు, పౌరహక్కుల సంఘం నాయకులు శ్రీమన్నారాయణ, సిఐటియు నాయకులు ఎవి నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు రామన్నతో పాటు పలు ప్రజాసంఘాలు, పలు రాజకీయపార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ది నిరంకుశ పాలన

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థదేనికి?' అంటూ ప్రశ్నించారు. వైసిపి నేతల విమర్శలన్నింటికీ ఈ నెల 12న జరిగే యూత్ మీటింగ్‌లో సమాధానమిస్తానన్నారు. ఎపిలో బిఆర్ఎస్ ప్రవేశంపై స్పందిస్తూ, తెలంగాణవాదం వదిలేసి వస్తున్నారు కనుక తప్పులేదన్నారు. ఏ పార్టీలోకి అయినా చేరికలు సహజమని, ఏ పార్టీ ఎక్కడైన పోటీ చేయవచ్చని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ప్రగ్యా ఠాకూర్‌కు ఎంపీగా ఉండే అర్హత లేదు..

- లోక్‌సభ స్పీకర్‌కు 100మందికిపైగా మాజీ బ్యూరోక్రాట్స్ లేఖ
- మైనార్టీలు లక్ష్యంగా పదే పదే విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని ఆరోపణ

న్యూఢిల్లీ : మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని బీజేపీ ఎంపీ ప్రగ్యాఠాకూర్ విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని మాజీ బ్యూరోక్రాట్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రగ్యాఠాకూర్‌కు పార్లమెంట్ సభ్యురాలిగా ఉండే అర్హత లేదని, ఆమె పదే పదే విద్వేష ప్రసంగాలు చేస్తూ పోతున్నారని లోక్‌సభ స్పీకర్‌కు రాసిన లేఖలో మాజీ బ్యూరోక్రాట్స్ తెలిపారు. ఈ అంశంపై లోక్‌సభ నైతిక విలువల కమిటీ దృష్టిసారించాలని, ఆమెపై అనర్హత వేటు వేయాలని కోరారు. ఈ లేఖపై 100మందికిపైగా మాజీ బ్యూరోక్రాట్స్ సంతకం చేశారు. "ఈ దేశంలో అమలయ్యే చట్టాలు పార్లమెంట్‌లో రూపొందుతాయి. రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఎంపీలెవ్వరూ వ్యవహరించరాదు. కానీ భోపాల్ బీజేపీ ఎంపీ ప్రగ్యా ఠాకూర్ హిందూయేతరులను లక్ష్యంగా చేసుకొని విద్వేష వ్యాఖ్యలు చేస్తున్నారు. డిసెంబర్ 25న శివమొగ్గలో సదరు ఎంపీ విద్వేష ప్రసంగాలు చేశారు. ఒక వర్గం వారిపై దాడికి తెగబడాలని, వారికి తగిన బుద్ధి చెప్పాలని హిందువుల్ని రెచ్చగొట్టారు. ఈ తరహా ప్రసంగాలు చేయటం అతడికి పరిపాటిగా మారింది" అని లేఖలో పేర్కొన్నారు. క్రిమినల్ కేసులు నమోదవుతాయనే ఆలోచనతో ఎంపీ ప్రగ్యాఠాకూర్ తెలివిగా వ్యవహరిస్తున్నారని లేఖలో వారు ఆరోపించారు. ఇలాంటి వ్యక్తి పార్లమెంట్‌లో ఉండి..చట్టాలు తయారుచేయటం ఏంటని ప్రశ్నించారు. ఆమె చేబుతున్న మాటలు, వాడుతున్న భాష నేరపూరితం. అంతేకాదు భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని ప్రమాణం చేసి..ఇలా వ్యవహరించటం..రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘించటమేనని స్పీకర్‌కు తెలిపారు. ప్రాథమిక హక్కులు, లౌకికవాదం, సమానత్వం, శాంతిభద్రతలు..భారత రాజ్యాంగంలో అత్యంత కీలకమైనవి. భారత రాజ్యాంగంలో మౌలిక స్వభావానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రగ్యా ఠాకూర్‌పై చర్యలు చేపట్టాలని లోక్‌సభ స్పీకర్‌ను వారు కోరారు. ఈ అంశాన్ని లోక్‌సభ ఎథిక్స్ కమిటీకి పంపాలని విన్నవించారు.

సెనెగల్‌లో రెండు బస్సులు ఢీకొని 40 మంది మృతి

సెనెగల్ : ఆఫ్రికా ఖండంలోని సెనెగల్‌లో ఆదివారం తెల్లవారుజామున రెండు బస్సులు ఢీకొనడంతో 40 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 87 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రభుత్వ బస్సు టైర్ పంక్షర్ అయి రోడ్డుపై అడ్డం తిరగ్గా, ఎదురుగా వస్తున్న మరో బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని సెనెగల్ అధ్యక్షుడు మాకే సాల్ ట్వీట్ చేశారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తూ మూడు రోజులపాటు సంతాపదినాలుగా ప్రకటించారు.

ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రయివేటీకరించడం దుర్మార్గం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశంలో కొత్త పరిశ్రమలు రాక ఉద్యోగాలు కరువై యువత నిరాశతో ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇటువంటి నేపథ్యంలో మరిన్ని పరిశ్రమలను నెలకొల్పాసిన ప్రభుత్వం ఉన్న వాటిని ప్రయివేటీకరించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 696వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ యూనియన్‌కు చెందిన కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు జి.గణపతిరెడ్డి, జె.రామకృష్ణ, పిట్టా రెడ్డి, నందికి తాతారావు, దొమ్మేటి అప్పారావు, గుమ్మడి నరేంద్ర మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి దేశాన్ని మరో సోమాలియాగా మార్చనుందా ? అని విమర్శించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి భూములిచ్చి నిర్వాసితులుగా మారిన 8500 మందికి నేటికీ ఉద్యోగాలు కల్పించలేదని తెలిపారు. వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా కార్మికవర్గం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దీక్షల్లో జి.సత్యారావు, గొడ్డి రమణ, అప్పలరాజు, హుస్సేన్, గొందేశి రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రమణ్యం

పోరాటాలకు కేంద్రాలుగా యుటిఫ్ భవనాలు

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి
- ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-పామూరు (ప్రకాశం జిల్లా)

యుటిఎఫ్ భవనాలు ఉద్యమాలకు కేంద్రాలని ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రకాశం జిల్లా సిఎస్‌పురం రోడ్‌లో దాచూరి రామిరెడ్డి పేరుతో నూతనంగా నిర్మించిన యుటిఎఫ్ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎన్నికల్లో ఎన్నడూ లేనివిధంగా రాజకీయ నాయకులను పోటీలో పెట్టడం దురదృష్టకరమని అన్నారు. ఉపాధ్యాయులు ఐక్యంగా పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కనిగిరి మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పారిశ్రామికవేత్త కోటపాటి జనార్దన్ మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే ఉందన్నారు. అవినీతిని ప్రశ్నించేతత్వం ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. స్వేచ్ఛలేని జీవితం బానిసతత్వంగా మారుతుందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలన్నారు. తొలుత యుటిఎఫ్ జెండాను వెంకటసుబ్బయ్య, తిరుపతిరెడ్డి, బ్రహ్మం ఆవిష్కరించారు. అనంతరం వి. శ్రీనివాసరాజు అధ్యక్షతన సభలో యుటిఎఫ్ నేతలు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులపై కేంద్రం ఎనలేని భారాలు

- సమన్వయ కమిటీ విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజలపైన, చేతి వృత్తిదారులపైన ఎనలేని భారాలను మోపుతోందని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య విమర్శించారు. కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేసేందుకు ఆదివారం ఇక్కడి ఎంబివికెలో సన్నాహక సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్లు కొల్లాటి శ్రీనివాసరావు, పిల్లల మర్రి బాలకృష్ణ అధ్యక్షత వహించారు. చేతి వృత్తిదారుల సంక్షేమం కోసమంటూ రాష్ట్రంలో 56 రకాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులు ఇవ్వకపోవడంతో.. అవి కేవలం అధికార పార్టీ నేతలకు రాజకీయ ఉపాధి కేంద్రాలుగా మారిపోయాయని తెలిపారు. బడ్జెట్‌లో రెండేళ్ల కాలంలో రూ.35 వేల కోట్లు నిధులు కేటాయించినట్లు చూపించి..ఆ నిధులను చేతి వృత్తిదారుల సంక్షేమానికి కాకుండా ఇతర వాటికి మళ్లించి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఈ సమావేశంలో మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్నాటి శ్రీనివాస్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్న మద్రివేడు గురుశేకర్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు లింగాల నిర్మలమ్మ, వల్లాబాపురం వెంకటేశ్వరరావు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనరు జుత్తిగ నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిరసనకారుల మద్దతుదారులపై ఇరాన్ ఉక్కుపాదం ..

టెహ్రాన్ : దేశంలో నిరసనలకు మద్దతిచ్చిన వారిపై ఇరాన్ ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వం తమలో ఎవరినైనా అరెస్ట్ చేయవచ్చని ఇరాన్ జర్నలిస్టులు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితిని సోషల్‌మీడియా ద్వారా జర్నలిస్టులు ప్రపంచానికి తెలియజేయడానికి యత్నించడం అక్కడి ప్రభుత్వానికి ఆగ్రహం కలిగించింది. దీంతో దేశంలో నిరసనలకు మద్దతు ఇచ్చే వారిని ఇరాన్ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని, జర్నలిస్టులను అరెస్ట్ చేయడం, వారి వ్యాసాలను మీడియా నుండి తొలగించడమే కాకుండా, హక్కుల ఉల్లంఘనలను ప్రపంచానికి వెల్లడించిన నిపుణులపై కూడా అణచివేత కొనసాగిస్తోందని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "2023 జనవరి 1వ తేదీన జర్నలిస్టు మిలాద్ అలవిని అదుపులోకి తీసుకున్నారు. ఎందుకు అని నాకు కూడా తెలియదు" అని మిలాద్ సోదరుడు ట్విటర్‌లో పోస్ట్ చేశారు. డిసెంబర్ 13న భద్రతా అధికారులు తమ అపార్ట్‌మెంట్‌లో సోదాలు చేసి, మిలాద్ ఫోన్ , ల్యాప్‌టాప్‌లను స్వాధీనంచేసుకున్నారని తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో హిజాబ్ సరిగా ధరించలేదంటూ మోరాలిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న మాహ్సా అమ్ని కస్టడీలో మరణించిడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.

మాట్లాడుతున్న అవాజ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్

మతం కాదు... మానవత్వం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

విద్య, వైద్యం, ఆర్థిక అభివృద్ధికి సచార్ కమిటీ అనేక సిఫార్సులు చేసిందని తెలిపారు. వీటిలో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. గ్యారంటీ లేకుండా ముస్లిములకు రుణాలు ఇవ్వాలని చేసిన సిఫార్సులు కాగితాలకే పరిమితం అయ్యాయని తెలిపారు. ముస్లిం, మైనార్టీలకు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సంస్థ ద్వారా ఇచ్చే రుణాలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసి, కేవలం నవరత్నాలతో సరిపెడుతోందని విమర్శించారు. కేంద్రం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వట్లేదన్నారు. ముస్లిముల సంక్షేమం, భద్రత, లౌకికవాదం, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవడానికి విశాల ఐక్య వేదిక ద్వారా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సంస్కరణల పేరుతో పట్టణ ప్రజలపై భారాలు

- పట్టణ నివాస ప్రాంతాల రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి-నెల్లూరు

పట్టణ సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పెను భారాలు మోపుతోందని పట్టణ నివాస ప్రాంతాల రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు విమర్శించారు. చెత్తపన్ను, ఇంటి పన్ను, విద్యుత్ భారాలు మోపడంతోపాటు మంచినీటి మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొని ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించాలని కోరారు. నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను పీడించి పన్నులు వసూలు చేసే వ్యాపార సంస్థలుగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మార్చివేసిందని విమర్శించారు. ఈ ఏడాది విద్యుత్తు ఛార్జీలు పెంచి సుమారు రూ.1500 కోట్లు మేరకు ప్రజలపై అధనపు భారం మోపిందన్నారు. 'ట్రూఅప్ ఛార్జీ'ల పేరుతో 36 నెలల్లో సుమారు రూ.2, 900 కోట్లు వసూలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే రంగం సిద్ధం చేసిందని తెలిపారు. విద్యుత్ నియంత్రణ మండలిలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో విచారణ జరగబోతుందన్నారు. విద్యుత్ సంస్థ ఆదాయం, వ్యయం రెండిటి మధ్య రూ. 13 వేల కోట్ల మేరకు తేడా చూపిస్తోందన్నారు. ప్రతి ఇంటికీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని, దీనికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వినియోగదారునికి ఖర్చవుతుందని తెలిపారు. ఇటు రాష్ట్రం, అటు కేంద్రం రెండు కలిసి అమలు చేస్తున్న విధానాల వల్ల వంటింటి గ్యాస్, పెట్రోల్, డీజల్ ధరలు, వస్తువుల ధరలు మండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భారాలన్నింటికీ వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 19, 20, 21 తేదీల్లో రెగ్యులేటరీ కమిషన్ ముందు అభిప్రాయాలు తెలియజేస్తామన్నారు. సమావేశంలో పట్టణ నివాస ప్రాంతాల జిల్లా కన్వీనర్ మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పాల్గొన్నారు.

మిర్చిపై 'నల్లి' దాడి

- కళ్ల ముందే పంట దెబ్బతింటుండడంతో రైతులు కన్నీరుమున్నీరు
- దున్నేయడం తప్ప వేరే దారి లేదంటూ ఆవేదన

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

మిర్చి పంటపై నల్లి పురుగు దాడి చేస్తుండడంతో రైతులు విలవిలలాడుతున్నారు. చేతికి అందివస్తున్న దశలో పంట కళ్లముందే దెబ్బతినడం చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. గతేడాదీ నల్లి పురుగు దాడికి మిర్చి రైతులు తీవ్ర నష్టాలను చూవిచూశాడు. ఈ ఏడాదీ అదే పరిస్థితి నెలకొంది. ఈ పురుగును అదుపు చేసేందుకు మందులు అందుబాటులో లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

ఏలూరు జిల్లాలో దాదాపు ఐదు వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. ఏటా సెప్టెంబర్‌లో సాగును ప్రారంభిస్తారు. మార్చికి పూర్తి స్థాయిలో పంట చేతికొస్తుంది. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ దశలో నల్లి పురుగు విజృంభనతో పూత మొత్తం రాలిపోతోంది. మొక్కలు కుచించుకుపోతున్నాయి. పురుగు మందులు వాడినా ప్రయోజనం లేకుండా ఉందని రైతులు వాపోతున్నారు. ఎకరా విస్తీర్ణంలో మిర్చి సాగుకు రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతోంది. నల్లి తెగులు సోకడంతో వారానికి రెండు, మూడుసార్లు పురుగుమందులు అదనంగా పిచికారీ చేయాల్సి వస్తోందని, దీనివల్ల అదనంగా రూ.50 వేల వరకూ ఖర్చవుతోందని రైతులు చెప్తున్నారు. పంట సవ్యంగా పండితే ఎకరాకు 25 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. నల్లి తెగులుతో రెండు నుంచి మూడు క్వింటాళ్లు దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. దీనిపై జిల్లా ఉద్యాన శాఖాధికారి పాండురంగరావును వివరణ కోరేందుకు ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరం

మిర్చి సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎకరాకు రూ.30 వేలు కౌలు, దాదాపు రూ.లక్షన్నర వరకూ పెట్టుబడి పెట్టారు. నల్లితెగులతో పంట దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో మిర్చి రైతులు గతేడాది ఆందోళన చేపట్టడంతో ఎట్టకేలకు ప్రభుత్వం ఎకరాకు రూ.19 వేలు పరిహారం అందించింది. భూయజమానులకే పరిహారం అందింది.

నలి తెగులు సోకడంతో ముడుచుకుపోతున్న మిర్చి పైరు

వాస్తవ సాగుదారుడైన కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందలేదు. ఈ ఏడాదీ ఇ-క్రాఫ్‌లో భూయజమానుల పేర్లనే అధికారులు నమోదు చేశారు. ఈసారైనా తమకు న్యాయం చేయాలని కౌలురైతులు కోరుతున్నారు.

పూత మొత్తం రాలిపోతోంది

రెండెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట వేశాను. ఎకరానికి కౌలు కాకుండా లక్షన్నర రూపాయల వరకూ పెట్టుబడి పెట్టాను. నల్లి తెగులు సోకి పూత అంతా రాలిపోతోంది. ఎన్ని పురుగు మందులు చల్లినా ప్రయోజనం లేకుండాపోతోంది. గతేడాదీ ఇదే విధంగా నష్టపోయాం. ఈసారి అదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సాయం అందించాలి.

-పామర్తి శ్రీనివాసరావు, వలసపల్లి, ముసునూరు మండలం

పంట దున్నేయడం తప్ప వేరే గత్యంతరం లేదు

70 సెంట్లు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేస్తున్నాను. నల్లి తెగులుతోపాటు, బొబ్బర తెగులు సైతం సోకడంతో పంటంతా దెబ్బతింది. దున్నేయడం తప్ప వేరే గత్యంతరం కనిపించడం లేదు. ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలి.

-యలమందల బాపనయ్య, శోభనాపురం, నూజివీడు మండలం

ఎకరానికి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలి

మిర్చి సాగును దెబ్బతీస్తున్న నల్లి తెగులును రాష్ట్ర విపత్తుగా గుర్తించాలి. పంట నష్టపోయిన వారికి ఎకరానికీ రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలి. సాగు చేస్తున్న కౌలు రైతుల పేర్లను ఇ-క్రాప్‌లో నమోదు చేయాలి. వారికే నష్టపరిహారం అందించాలి. నూజివీడు సబ్‌డివిజన్ పరిధిలో ఉద్యాన శాఖాధికారిని నియమించి రైతులకు అందుబాటులో ఉండేలా చేయాలి.

-నిమ్మగడ్డ నరసింహ, ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

రూ.50 వేలు విరాళాన్ని వి శ్రీనివాసరావుకు అందజేస్తున్న గుంటూరు వేమయ్య

సేవా, సాంస్కృతిక కేంద్రాలుగా విజ్ఞాన కేంద్రాలు

- విస్తృత సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ నిర్మాణానికి దాతలు స్పందించాలని పిలుపు

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

సేవా, సాంస్కృతిక కేంద్రాలుగా విజ్ఞాన కేంద్రాలు విరాజిల్లేలా నిర్వహణ ఉంటుందనిసిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్మించే కేంద్రానికి విరివిగా దాతలు సహకరించాలని కోరారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో విస్తృత సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జిల్లాలో విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఏర్పాటు నిర్ణయం సముచితమని, ఈ ప్రాంతానికి ఉన్న సుదీర్ఘ చరిత్ర నేపథ్యంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్‌గా నామకరణం చేసినట్లుగా పేర్కొన్నారు. బ్రహ్మనాయుడు కుల వ్యవస్థను సవాలు చేస్తూ చాప కూడు సిద్ధాతం ప్రవేశపెట్టడం ద్వారా కులాలన్నీ ఒకటే అని చాటి చెప్పిన గడ్డ పల్నాటి గడ్డ అని గుర్తు చేశారు. ఇప్పటికే చాలామంది దాతలు ముందుకు వచ్చి భూరి విరాళాలు ప్రకటించారని విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి జిల్లాకు చెందిన పెద్దలతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. వెనుకబడిన ఈ ప్రాంత అభివద్ధికి విజ్ఞాన కేంద్రం దోహదం చేస్తుందన్నారు. విజ్ఞాన కేంద్రం అధ్యయనం, సర్వేలు చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య మాట్లాడుతూ ఈ కేంద్రం అభ్యుదయ భావజాలాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దోహదం చేస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ లక్ష్మేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, కార్యదర్శివర్గ సభ్యులు వై రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు నాయకులు గద్దె చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీగా విరాళాలు

పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ నిర్మాణానికి సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య రూ.20 లక్షలు విరాళం ప్రకటించారు. గద్దె ఉమశ్రీ చిలకలూరిపేట మహిళా కమిటీ తరపున రూ.లక్ష, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ తండ్రి గుంటూరు వేమయ్య రూ.50 వేలు, మాదల సిపిఎం మాజీ సర్పంచ్ పొట్టి సూర్య ప్రకాషరావు రూ.50వేలు, నాయకులు శ్రీనూనాయక్ రూ.10వేలు విరాళాన్ని వి శ్రీనివాసరావుకు అందజేశారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒంగోలు రీజియన్ పరిధిలో గ్రేడ్-ఎ సూపర్ వైజర్‌పోస్టుల నియామకానికి ప్రకటించిన లిస్టుల్లో వివిధ కేటగిరీలకు ఉన్న రూల్ ఆఫ్ రిజర్వేషన్స్‌ను పాటిస్తూ తిరిగి లిస్టులను ప్రకటించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శికి ఆదివారం లేఖ రాశారు.

రాజకీయ రంగంపై దృష్టిపెట్టండి

- ఆర్యవైశ్యుల మహాసభలో డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వ్యాపార రంగంలో రాణిస్తున్న ఆర్య వైశ్యులు రాజకీయ రంగంలోనూ రాణించాల్సిన అవసరముందని డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గుంటూరులోని ఎ5 కన్వెన్షన్ సెంటరులో ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర స్వర్ణోత్సవ వేడుక సభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు వ్యాపార రంగంతోపాటు విద్యా రంగంలో రాణించాలని, రాజకీయం రంగంలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసే సన్నివేశాలు ఉన్న చింతమణి నాటకాన్ని రాష్ట్రంలో నిషేధించిందని తెలిపారు. దేవాలయాలు, సత్రాల నిర్వహణను ఆర్యవైశ్యులకు అప్పగించారని అన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎంపి టి.జి.వెంకటేష్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డిఐజి శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ గ్రంధి వెంకటేష్, శ్రీశైలం వాసవీ సత్రాల సమూదాయం చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, మహిళా అధ్యక్షురాలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న డిప్యూటీ స్పీకర్

మాచర్లలో టెన్షన్ టెన్షన్

- సంతకాలు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు హాజరైన టిడిపి నేత బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా మాచర్లలో మరోసారి టెన్షన్ వాతావరణం నెలకొంది. గత నెల 16న మాచర్లలో జరిగిన ఘర్షణల నేపథ్యంలో కండిషన్ బెయిల్ పొందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు కోర్టు ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చారు. టిడిపి నాయకుల రాక నేపథ్యంలో వైరీ వర్గాలు ఘర్షణ పడతాయన్న అనుమానంతో 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి నేతృత్వంలో 23 మంది ఒక ప్రయివేటు బస్సులో మాచర్లకు వచ్చారు. టిడిపి నాయకులపై నమోదైన హత్యాయత్నం కేసుల్లో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

మాచర్లలో పోలీసుల పహరా

హైకోర్టు ఆదేశాలతో మాచర్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టారు. మరోవైపు పోలీసులు భారీగా మోహరించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌కి వెళ్లే రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. మీడియాను సైతం పోలీసులు అనుమతించలేదు. పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న వ్యాపార సంస్థలను కూడా మూసివేయించారు. ఆర్‌టిసి బస్టాండ్‌లోకి సైతం బస్సులు వెళ్లకుండా మరోచోట పార్కింగ్ చేసుకునేలా ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బ్రహ్మారెడ్డి గ్రూపు మాచర్ల నుంచి వెళ్లే వరకూ పట్టణంలో ఉద్రిక్తతత నెలకొంది.

పరస్పర సహకారం

- ఆపి, ఎపి వైద్య, ఆరోగ్య శాఖ మధ్య ఒప్పందం
- విశాఖలో ముగిసిన గ్లోబల్ హెల్త్ సమ్మిట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ (ఆపి), ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ ఇక నుంచి పరస్పర సహకారం అందించుకునేలా ఒప్పందం చేసుకున్నట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి టి కృష్ణబాబు వెల్లడించారు.

నోవొటెల్ హోటల్‌లో మూడ్రోజుల పాటు ఆపి ఆధ్వర్యంలో జరిగిన గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ఆదివారంతో ముగిసింది. చివరి రోజు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాజా ఒప్పందం వల్ల ప్రవాస భారతీయ వైద్య ప్రముఖుల సేవలను రాష్ట్ర ప్రభుత్వ వైద్యశాలలు, వైద్య విద్యాలయాలు వినియోగించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సమ్మిట్‌లో పాల్గొన్న వైద్య రంగ నిపుణుల సూచనలు, సలహాలను ప్రభుత్వం తీసుకుని ఆచరణకు కృషి చేస్తుందని తెలిపారు. విదేశీ వైద్య ప్రముఖులు రాష్ట్రానికి వచ్చిన సమయంలో ముఖ్య ప్రభుత్వ వైద్యశాలల్లో అత్యవసర చికిత్సలతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని కోరారు. ఇతర దేశాల్లో స్థిరపడిన ఎపి వైద్యులు వారి అనుభవాలను రాష్ట్ర వైద్య విధానంలో మార్పుల కోసం పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగంలో చేస్తోన్న పలు కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జిఎస్.నవీన్ కుమార్, ఆపి ప్రతినిధులు డాక్టర్ టి.రవి రాజు, డాక్టర్ రవీంద్ర కొల్లి, డాక్టర్ రవి శంకర్ నారాయణ, పలువురు భారతీయ సంతతి అమెరికా వైద్యులు, దేశంలోని ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణబాబు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న బొప్పరాజు

ముఖ ఆధారిత హాజరుతో ఇబ్బంది పెట్టొద్దు

- సిపిఎస్, జిపిఎస్ రెండూ నష్టమే
- ఉద్యోగ అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు
- కర్నూలులో ఫిబ్రవరి 5న జరిగే అమరావతి జెఎసి వార్షికోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఉద్యోగులపై ప్రజల్లో వ్యతిరేకత తీసుకొచ్చే విధంగా ఉన్నాయని ఎపి అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విమర్శించారు. ఉద్యోగులు పనిచేయడం లేదంటూ ఫ్లయింగ్ స్క్వాడ్‌ల పేరుతో తనిఖీలు చేయించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతనైతే ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు కలెక్టరేట్‌లోని పొదుపు భవన్‌లో ఎపి అమరావతి జెఎసి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఫిబ్రవరి 5న కర్నూలులో నిర్వహించే అమరావతి జెఎసి రాష్ట్ర మూడవ వార్షికోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగులు సరిగ్గా పని చేయడంలేదని ప్రభుత్వం భావించడం సరికాదని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు పేదలకు పూర్తి స్థాయిలో అందుతున్నాయంటే అందుకు ఉద్యోగులే కారణమన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ముఖ ఆధారిత హాజరు పేరుతో ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. దీనినే ఉద్యోగుల జీతాలకు ముడి పెట్టొద్దని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ విధానం ఆమోదయోగ్యం కాదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సిపిఎస్, జిపిఎస్ రెండూ నష్టదాయకమని తెలిపారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. వచ్చే నెల ఐదున జరిగే అమరావతి జెఎసి వార్షికోత్సవ సభకు పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు తరలిరావాలని కోరారు. సమావేశంలో అమరావతి జెఎసి జిల్లా చైర్మన్ గిరికుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వెంకట్‌రెడ్డి, నాగరమణయ్య మద్దిలేటి పాల్గొన్నారు.

వస్త్ర వ్యాపారం కుదేలు

- విజయనగరం టెక్స్‌టైల్స్ మార్కెట్‌పై కార్పొరేట్ దెబ్బ
- పోటీని తట్టుకోలేక విలవిలలాడుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పది మందికి వచ్చే లాభాన్ని ఒక్కరే మింగేస్తే ఎలా ఉంటుందో.. అచ్చంగా అలాగే ఉంది వస్త్ర వ్యాపార రంగంలో వచ్చిన మార్పు. 400 మందికి రావాల్సిన లాభాలు, కేవలం నలుగురైదుగురు మాత్రమే తన్నుకుపోతున్నారు. వస్త్ర వ్యాపార రంగానికి పెట్టింది పేరుగా ఉన్న విజయనగరంలో అచ్చంగా అదే సాగుతోంది. దీంతో స్థానిక వ్యాపారులు విలవిల్లాడుతున్నారు. ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. దుకాణాల్లో పనిచేసే సేల్స్‌మెన్లు, ఇతర సిబ్బందికీ డిమాండ్ తగ్గింది. వ్యాపారులు కక్కలేక మింగలేక అన్నట్టుగా లోలోపల మదన పడుతున్నారు.

ఉత్తరాంధ్ర, ఒడిశాలోని పలు ప్రాంతాల్లో కొత్త దుస్తులు అనగానే టక్కున గుర్తొచ్చేది విజయనగరమే. ఇక్కడ దొరకని వెరైటీలు, డిజైన్లు మరెక్కడా దొరకవంటే అతిశయోక్తి కాదు. నగరంలోని బాలాజీ టెక్స్‌టైల్స్ మార్కెట్‌లో సుమారు 300 వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా మెయిన్‌రోడ్డు, ఉల్లివీధి తదితర ప్రాంతాల్లో చిన్నా, పెద్దా కలుపుకుని మరో 400 దుకాణాలు ఉన్నాయి. సూరత్, కోల్‌కత్తా, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి స్థానిక వ్యాపారులు రూ.కోట్ల విలువ చేసే సరుకులను నిరంతరం దిగుమతి చేస్తుంటారు. ముఖ్యంగా బాలాజీ మార్కెట్ నుంచి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఒడిశాలోని రాయగడ, పర్లాకిమిడి, బరంపురం, సుంకి, సునాబెడా మీదుగా జైపూర్ వరకు ఉన్న చిన్న వ్యాపారులు వస్త్రాలను కొనుగోలు చేస్తుంటారు. వారు దుకాణాల్లోనూ, గ్రామాల్లోనూ తిరుగుతూ వస్త్రాలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. సంక్రాంతి, క్రిస్మస్, ఉగాది, దీపావళి తదితర పండగలకు నెల రోజుల ముందు నుంచే వ్యాపారులు, వినియోగదారులతో మార్కెట్ రద్దీగా ఉంటుంది. పెళ్లిళ్ల సీజన్, ఇతర శుభకార్యాల సమయంలో మరింత కళకళలాడుతుంది. జిల్లాలో వస్త్ర వ్యాపారం రోజూ రూ.కోట్లలోనే సాగుతుంది. గడిచిన దశాబ్ద కాలంగా బహుళజాతి సంస్థలు విజయనగరంలో కుప్పలు తెప్పలుగా ఏర్పడడంతో పూర్వం నుంచీ ఉన్న వస్త్ర దుకాణాలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

విజయనగరంలో బాలాజీ టెక్స్‌టైల్స్ మార్కెట్

చిరువ్యాపారులు కుదేలు

ఇటీవల విజయనగరంలో సౌత్ఇండియా షాపింగ్‌మాల్ ఏర్పడింది. అంతకు ముందే రిలయన్స్, సిఎంఆర్, కళావైభవ్, ట్రెండ్స్, ఈజీబై, మ్యాక్స్, తదితర మల్టీ నేషనల్ కంపెనీలు వచ్చాయి. త్వరలో డి-మార్ట్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కొన్ని షాపింగ్ మాల్స్‌లో దుస్తులతోపాటు ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ గూడ్స్, బంగారం వంటి అనేక రకాల వస్తు సామగ్రి అందుబాటులో ఉంచడంతో జనం సహజంగానే వాటి వైపు మొగ్గుచూపుతున్నారు. దీనికితోడు అన్ని రకాల వస్త్రాలు, వస్తు సామగ్రిపై ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. దీంతో, అనివార్యంగా పూర్వం నుంచీ ఉన్న దుకాణాల్లోని వ్యాపారం తగ్గుతోంది. కొనుగోలుదారుల సంగతి పక్కనబెడితే, బహుళజాతి సంస్థలతో పోటీని తట్టుకోలేక చిన్న, మధ్య తగరతి వ్యాపారులు కుదేలవుతున్నారు. వాటిలో పనిచేసే కార్మికులకు పనితగ్గుతుండడంతో అనివార్యంగా మెన్‌పవర్ తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో కార్మికులకు కూడా డిమాండ్, వేతనాలు తగ్గుముఖం పట్టాయి. గతంలో చదువుకోవడానికి వచ్చిన యువతీ, యువకులు పండగల సీజన్లలో దుకాణాల్లో పార్ట్ టైం జాబ్ చేసి తల్లిదండ్రులపై భారాలు పడకుండా చూసుకునేవారు. ప్రస్తుతం షాపింగ్‌మాల్స్ వచ్చాక అటువంటి అవకాశాలు తగ్గిపోయాయి.

జాజుపూతల తలుపు రెక్కలు

ఇగో, ఇక్కడే
రెండు ట్రాక్టర్ల ఇసుక కుప్ప ఉండేది
పొద్దంతా ఇసుక జల్లెడ పట్టి
చినిగిన ఇనుప జాలి అయ్యేది అమ్మ
నాయినేమో, మేస్త్రీ కింద పార పని చేసి
నెత్తికే అంటుకపోయిన
సుట్టుబట్టలాగా కన్పించేటోడు

ఎక్కడ చూసినా
సీకులు, సిమెంటు దుమ్ము
ఇటుకపెల్లలు, దొడ్డిసుక
చిన్న కంకర రాయి పక్కకు జరిగినా
కుప్పనూకి రాశి పోసేది అమ్మ
బడికెళ్ళి వచ్చినంక
నాకూ, చెల్లెకు గోడకు నీళ్ల తాపే డ్యూటీ
బోరింగు కొట్టి
చెల్లెలు దమ్ముల నీళ్ళు నింపుతుంటే
ఇటుకగోడల మీదంగ నేను
సన్నటి నీటిధారనౌదు

ఎప్పుడైన ఈ మిద్దె ఎక్కినప్పుడు
నాయిన ఇక్కడే ఎక్కడో నిలబడి
నీళ్ళు మంచిగ పోయమని కోపం చేస్తున్నట్టు
గోడలు ఎన్ని నీళ్ళు తాగితే
అంత బలంగా ఉంటాయని చెబుతున్నట్టు ఉంటది

ఈ మల్లెచెట్టు ఉన్న తావునే
చిన్న కంకరరాళ్ళ కుప్ప ఉండేది
అలిసిపోయి దీని మీదనే
బొంతేసుకొని ఒరిగేది నాయిన
సారసుక్క తాగి పాటందుంకుంటే
సందమామ కదలక మెదలక నిలబడేది

ఈ సజ్జలు చూసినవా
ఇక్కడి దాక వచ్చి ఇల్లు ఆగినపుడు
ఎందరి కాళ్ళో పట్టుకుండంట నాయిన.
పైసల చెట్టు కాయలేదన్న సుట్టమేగాని
ఒక పునాదిరాయి అయినవారు లేరు
అమ్మ , నేను కూర్చున్నప్పుడు
ఎప్పుడూ ఇదే జోలి ఎల్లబెడుతుంటది

గవర్నమెంటు ఇచ్చిన సీకులు, సిమెంటు
మధ్యన ఎవరి చేతిలో మాయమైనవో
రెండు దోసిళ్ళ మన్నుపోసి సాపిస్తుంటే
దు:ఖంతో, కోపంతో
గుండెకుండలో రక్తం సలసల మరిగేది.

ఈ కిచెన్ రూం కన్పిస్తుందా?
ఇంతకు ముందు ఇక్కడే
ఎర్రమన్ను అరుగు మీద
రెండు లబ్బరు బిందలు
పక్కనే ఒక ఇత్తడి బింద
చీమలు పడుతవని బువ్వకుండ
ఉట్టి మీద కూసోని ఉయ్యాలూగేది

ఈ దొండపాదు ఉంది చూడూ
ఇక్కడ్నే పెద్ద కంప చెట్టు
దీన్ని ఆనుకొని తాటికమ్మల గుడిసె
ఇంత ఈ చిన్న గుడిసెలో
నలుగురం ఎట్ల పట్టినమో తెల్వదు.
వానకు ఈ గుడిసె కూలిపోతదని
బట్టల మూటలను, గిన్నెలు గిలాసలను
దబదబ సర్దుకోవడమే ఇండ్లకు వచ్చినట్టు
ఇంత కష్టపడి కట్టుకున్న ఈ ఇంట్లో
యేడాదన్నా సుఖపడలే నాయిన
మా కెవ్వరికి చెప్పకుండా
చెలుకలో ఇల్లు కట్టుకుండు.

ఈ జాజుపూతల తలుపు రెక్కల్ని
ఒక సారి పట్టుకొని చూడు-
నాయిన సచ్చిపోయినంక
గవర్నమెంటు పైసలొస్తే
గుర్తుగా ఈ తలుపులు చేపిచ్చినము!

- తగుళ్ళ గోపాల్
95050 56316

అలంకారం

శిఖర సౌందర్యం ప్రశంసనీయమే
అదే క్రమంలో లోయ సొగసు గొప్పదే
దేనికీ ఎప్పుడూ కంపించని
మనో ధారుఢ్యంతో పాటు
చలనసహితమైన జీవితాన్ని వదలకూడని తెలియట్లా ?

అహంకారం , అనుమానం ప్రమాదమని
ఇప్పటికైనా తెలియక పోతే ఎట్లా?
మనిషి అవసరం కోసమే ఏదైనా స్వీకరించడం,
ఇది చాలనుకోవడం సులకనేం కాదు
అది తక్కువతనం అంతకన్నా కాదు

కడలి కెరటం దూకుడు ఒకరైతే
నదీలో అల నడక మరొకరిది
ఎప్పుడూ దేనికీ ఇది లేదని, అది లభించలేదని
దు:ఖించరాదని తెలుసుకోకపోతే ఎట్లా?
ఉన్నది చాలు
ఇక్కడుంటే చాలు
కీర్తి కిరీట ధారి ఒకరైతే
తలగుడ్డ వారసత్వం ఇంకొకరిది
ఇక్కడ ఒక మంచి మనిషిగా బతగ్గలగడమే
ఏ మనిషికైనా అందం, అలంకారం!

- రవి నన్నపనేని
9182 181390

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా.. prajasavvadi@gmail.com

"విమర్శకుడు సాహిత్యాన్ని ప్రేమించాలి. ఆ ప్రేమ గుడ్డిది కాకూడదు. రచయితల మీద గౌరవం ఉండాలి. అది అహేతుకం కాకూడదు. విమర్శకుడు విద్యార్థిగా ఉంటూనే ఉపాధ్యాయుడి పాత్ర నిర్వహించాలి." - త్రిపురనేని మధుసూదనరావు

కొన్ని కలాలు .. ఒక కలయిక ...

సందర్భం

గొప్ప సాహిత్యానికి పుట్టినిల్లుగా విజయవాడను చెప్పుకుంటాం. కానీ కొంతకాలం నుంచి ఈ ప్రాంతం సాహిత్య క్షామంతో కొట్టుమిట్టాడుతోంది. ఒకానొక సమయంలో కరోనా కవుల, రచయితల కదలికలను, కలయికలను కట్టడి చేసింది. ఆన్‌లైన్ మీటింగుల ఒరవడి కారణంగా కవులు, కలాలు కలుసుకుని మాట్లాడుకోవడం అరుదై పోయింది! కోవిడ్ తీవ్రత, హడావిడి తగ్గాక అక్కడక్కడా సాహిత్య చినుకులు మళ్ళీ కురవడం మొదలైంది. పుస్తకాల విడుదలలు, కవితల పోటీలు, అవార్డులు, రివార్డులు అందుకోవడాలు వంటి ఎన్నో ముచ్చట్లు, ముబారక్‌ల సందడితో ... 2022 మురిసిపోయింది. మరి కొత్త సంవత్సరం ఎలా ఉండాలి? ఎలా మొదలవ్వాలి? అన్న ఆలోచనలోంచి విజయవాడలోని సాహితీ మిత్రులు .. ఆరోజు సాయంత్రం ఓ చిన్న కలయిక ఏర్పాటు చేసుకున్నారు. కవిత్వ పఠనంతో 2023ని ఆహ్వానించారు. ఇలా ఒక కవిత్వపు సాయంత్రాన్ని అందంగా డిజైన్ చేశారు కవిమిత్రులు తంగిరాల సోనీ, అనిల్ డానీ. 'అనేక' బుక్‌స్టాల్ వేదికగా అందరూ కలుసుకున్నారు. Like a piece of ice on a hot stove the poem must ride on its own melting అంటారు రాబర్ట్ ఫ్రాస్ట్. జనవరి 1 సాయంత్రం సాహిత్యం సమయాన్ని అలా కరిగించేసింది.

మత విద్వేషాలు మిన్నంటుతూ అందరి మీద అగ్ని వర్షం కురుస్తున్న వేళ ... కవి సర్వేశ్వరావు తన కవిత 'మా వాడ తల్లి-సిరిశాసి'లో ఇలా అంటారు : 'మీ ఒళ్ళంతా మతవిద్వేషాల జలదరింపులు మర్కట కర్కాటకాలే / ఐనా గొడ్డు మాంసం నా రక్తం నా శరీరం / మా అస్తిత్వ చైతన్యం' అంటూ తనదైన గొంతుతో మత విద్వేషాలను రెచ్చగొడుతూ మనుషుల్ని పావుల్ని చేసి ఆడిస్తున్న వ్యవస్థను దుయ్యబట్టారు. మరో బలమైన కవి బంగార్రాజు కంఠ... సైలెంట్‌గా కనిపిస్తూ అణుబాంబులాంటి కవిత్వాన్ని సృజియిస్తారు. ఒక మతం గొప్పదని, మరొక మతం హీనమని భావించే కొంతమందిని ఉద్దేశించి రాసిన 'గురివింద కాండ' కవిత వినిపించారు. చాలా బలమైన వాక్యాలను అర్థవంతంగా, సరళంగా రాశారు. 'బాలకాండలూ / సుందరకాండలూ ముగిసిపోయాయి / దేశంలో ఇప్పుడు గురివిందకాండ నడుస్తోంది / నువ్వు పెట్టేది దేవుడు తినడు / దేవుడు నీ నోటికివ్వడు / సర్వమత సారం ఒకటే సర్వాంతర్యామీ ఒకడే/ నమ్మం కుదరకపోతే/ అసలు దేవుడే లేడని ప్రకటించండి" అని ముగించారు. మరో ప్రముఖ కవి మోహన్ రాంప్రసాద్ ... హైకూలతో చెణుకులు విసిరుతూ వావ్ అనిపించుకుంటారు. 'మా ఊరు ఒక హైకూ' అని తాజాగా ప్రచురించిన తన పుస్తకంలోంచి కొన్ని అద్భుతమైన వాక్యాలను చదివి వినిపించారు. 'చింతతోపుల్లోంచి మా ఊరిని చూస్తే చందమామ కనిపిస్తుంది/ నిండు పున్నమి నాడు చందమామను చూస్తే మా మేనమామ కనిపిస్తాడు/ మా అమ్మ ఒడి/ వేయి గదుల బడి / బతకడం నేర్పింది/ ఆకాశంలో పూచేవి/ చివరిసారిగా మమ్మల్ని చూడాలనుకున్న మాస్టారుకి / కన్నీటి పొర అడ్డొచ్చింది / ఆఖరి రోజు మా మాస్టారు నా తల నిమిరారు/ నాకు కవిత్వం తలకెక్కింది.' అంటూ చిట్టి చిట్టి వాక్యాలతో చిక్కనైన చక్కని కవిత్వం చెప్పారు.

ప్రముఖ కవయిత్రి మందరపు హైమావతి తన 'ఇస్త్రీ అమ్మాయి' కవితను వినిపించారు. 'అమ్మా, అక్కా అని పిలుస్తూ ఆ పదానికి ముందు ఒక అక్షరాన్ని చేర్చి / నా పేరునే ఒక బూతు పదంగా మలిచి/ తుంటరి మాటలు రువ్వే ప్రపంచంలో నిలువెత్తు ఆత్మగౌరవంగా ఆమె/ రాత్రి నక్షత్రాలు నవ్వగానే తోలు బొమ్మలాటలో తెర మీద కదిలే బొమ్మల్లా ఒక్కొక్కరు వెళ్లిపోగానే గంట కొట్టాక/ పిల్లలు లేని బడిలా/ బంధువులందరూ తరలిపోయిన పెళ్లిపందిరిలా ఒంటరిగా ఇస్త్రీ బండి' అంటూ ఎంతో ఆవేదనతో కవిత ముగించారు. మరొక కవయిత్రి వైష్ణవిశ్రీ ... 'బాల్యం రెక్కలు విరించిందెవరో' అంటూ కొన్ని బలమైన వాక్యాలను వినిపించారు. 'చందమామ, బాలమిత్ర కథల్లో నువ్వూ నేనే / భట్టి విక్రమార్కుడు మన పసినాన్న హీరో / బాల్యం అక్కడే ఆగిపోయిందా లేదు కదా యవ్వనం చేయి చాచి పిలిచిందిగా / హార్మోన్ల నెత్తుటి ప్రవాహమై కాసింత భారాన్ని దింపుకున్నాయిగా / శిథిలమైన బాల్యమా / నిన్నెక్కడని వెతకను / ఏం చేయాలో తెలియక ఒంటరి కోడి పిల్లలా నేను' అంటూ బాల్యం గురించి అందులో ఉండే ఆనందం, ఆవేదన గురించి వివరించారు.

సీనియర్ కవి శిఖ ఆకాష్ తన పదునైన వాక్యాల చెర్నాకోలతో 'ప్రకటన' అంటూ ఒక అద్భుతమైన కవితను చదివారు. 'కాషాయం పొగలు మింగేసిన కాలమా/ నియంతల్ని కుప్పకూల్చినా కాలమా/ నువ్వెలా వచ్చినా భయపడేది లేదు/ మనువు అంత్యక్రియలు చేయడానికే/ మతోన్మాదుల మరణశయ్యను సిద్ధం చేయడానికే వేచి వున్నాం/ రండి ముఖంలో అద్దం చూసుకుందాం/ చరిత్రను నడిరోడ్డు మీద నగ్నంగా ఆరేద్దాం/ నన్ను అశుద్ధుడిని చేసినవాడా/ నీ సమస్త మురికిని శుద్ధి చేసే అసలు మనిషిని నేనేనని ప్రకటిస్తున్నా' అంటూ కొండల్ని కూడా పిండి చేసే వాక్యాలతో అందరినీ అలరించారు.

ప్రముఖ కవి సరికొండ నరసింహరాజు 'కాలం పూలతోటలో అన్వేషిస్తూ' అంటూ తన కవితను బలమైన గొంతుతో చదివి వినిపించారు. 'ప్రాణ స్నేహితుడిలా వెంటే ఉంటూ/ ఎందుకలా వెన్నుపోటు పొడుస్తావ్/ ఎంత ఆత్మీయత నటిస్తావ్/ మాటేసి మాన్ ఈటర్‌లా కబళిస్తావ్ కదా/ నీడలా ఉంటూ నియంతలా మారతావ్/ నరహంతకివవుతావేం/ నీ గెలుపు కోసం నిత్యం ఓడిపోతూనే ఉంటాం కదా / నువ్వు పాడబోయే రాగమేదో సెలవిస్తే/ మా దారి దీపమవుతామని ఆశించాం/ ఒక పూలముఖంతో వచ్చి మా గుండెల్లో గడియారం ముళ్ళు గుచ్చి/ నువ్వు కాలుష్య పతాకివి, విభజన సునామీవి / కనిపించకుండా కబళించే కరోనావే' అంటూ తన పదునైన కవిత వినిపించారు.

ఈ కలయికకు కారణమైన యువకవి తంగిరాల సోనీ.. 'నా ప్రియమైన నూతన సంవత్సరమా!' అంటూ ఇక్కడ ఎప్పుడో / మనుషులు చిగురించడం మానేసారు/ విడి ఆకాశంలా/ విడిపోతూ వాడిపోతున్నారు/ నది నురగల్లాంటి / నవ్వులే లేకుండా పోయాయి/ సముద్రంలా స్నేహమే చేయలేక పోతున్నారు' అంటూ ... 'ఇకనైనా అంతా సమానత్వం రావాలి, స్త్రీలను గౌరవించే సమాజం రావాలి' అంటూ వినసొంపుగా చెప్పి అందరినీ ఆకట్టుకున్నారు.

మరొక కవి, కార్యక్రమ బాధ్యుడూ అనిల్ డానీ తనదైన శైలిలో 'నల్ల దారం' కవిత వినిపించాడు. 'అసలు సంగతి అంతా చూపులోనే ఉంది/ అంచనా వేయడానికి నేర్పు అక్కర్లేదు / పీడిత సమూహాల్లోకి రాళ్లు విసరడమే ముఖ్యం/ అంతా నలుపే/ ఆదిమ ద్రావిడ రాజులు రాక్షసుల్లా చెక్కబడతారు/ వేదవాక్యాలు పాళీల్లోంచి/ పాలిపోయిన రంగులన్నీ ఒలికిపోయి/ మూల వాసులు దేహాల్ని అసహ్యించుకుంటాయి / అసలు నిజాలన్నీ తాళపత్రాల కింద కప్పెట్టి/ అసత్యాలన్నీ కొత్త రంగు పులుము కుంటాయి/ రంగు మీద ప్రేమ ఎక్కువైనా దేశంలో / ఎలుక తోలు రంగు కూడా సామెతైపోతుంది / దేహం మీదకు పరుల దృష్టి పడకుండా కాలికి కట్టుకున్న నల్ల దారంలా ద్రావిడ జాతి తనకు తాను ఫణంగా ఒడ్డుకుంటూ" అంటూ నలుపు రంగు గురించి మంచి కవితను వినిపించారు.

రజియా బేగం ఇప్పుడిప్పుడే అలతి అలతి పదాలతో ఒక్కో ఇటుకను చేర్చుకుంటూ కవిత్వపు ఇంట్లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారు. ఆమె తన 'స్త్రీ శక్తి' కవితను చదివి వినిపించారు. మంచి కవిమిత్రులతో సావాసం చేస్తూ కవిత్వపు తోటలో ఒక పూవై విరబూస్తున్న విజయశ్రీ దుర్గ 'వృద్ధాప్యం' మీద తన కవితను చదివి వినిపించారు. మనసుకు వృద్ధాప్యం వరమో, శాపమో/ లోపల ఏదో గుబులు/ చెప్పుకోలేని నిరాశ నిస్పృహలు అంటూ తనదైన గొంతు వినిపించారు. కలిమిశ్రీ ఒక చిన్న ఉల్లిపాయ బాంబు లాంటి చిట్టి కవితను వినిపించారు. 'నిన్న ఆ ఇంటిపై ఎగిరే పార్టీ పతాకాలు చెప్పేవి/ నేడు ఆ ఇంటి గుమ్మం ముందు విసిరివేయబడుతున్న దినపత్రికలు చెబుతున్నాయి/ ఆ ఇంటాయన ఏ పార్టీకి చెందిన వాడోనని' అంటూ ముగించారు. మరో కవి గద్దం విజయరావు 'మానవత్వమా.. మత్తు కౌగిలి' అంటూ తన కవిత్వాన్ని చదివి వినిపించారు. మతం మత్తులో జోగుతున్న మానవత్వమా మేలుకో / మనోభావాలు అందరికీ ఉంటాయని తెలీదా/ ప్రశ్నించడమే నేరమైన ఈ రాజ్యంలో మానవత్వమా మేలుకో/ పైడి తెరేష్‌లా, మద్దూరిలా, కత్తి మహేష్‌లా, భైరి నరేష్‌లా అప్పుడప్పుడు ప్రశ్నిస్తాయి/ మతోన్మా దాన్ని పెంచాలని చూసే దురాచారులారా/ తత్వాన్ని అడగండి/ మానవత్వాన్ని మేల్కొలపండి' అంటూ ప్రస్తుత పరిస్థితిపై అప్పటికప్పుడు రాసి కవితను వినిపించారు.

విజయవాడకు చెందిన అమూల్యచందు "సేమ్ టు సేమ్" కవితలో తన ఆవేదన వ్యక్తం చేశారు. 'నువ్వు ఏ వయసులో ఐనా ఉండొచ్చు/ కానీ ఎవరో నీలో రగిల్చిన అగ్నితో/ 365 రోజులు మండుతూనే ఉంటావు.. అబద్దాన్ని చూస్తూ, తిట్టుకుంటూ/ నిజాన్ని నగ్నంగా బయటపెట్టలేక పళ్ళు నూరుతూ ఉంటావు.. పాత గోడ మీద/ కొత్త కేలండర్ అంతే/ మిగతాదంతా సేమ్ టు సేమ్..' అని తన కవిత వినిపించారు.

ప్రముఖ కవి అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ 'ఈ సమావేశంలో భిన్న అస్తిత్వాల కలయిక జరిగింది. ఇప్పుడు కావాల్సింది ఇదే' అన్నారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ, 'ఈ రోజు రంగురంగుల సూదులతో, దారాలతో నేసిన కవిత్వ నేత అద్భుతంగా ఉంది. కవి తన పదాన్ని రోడ్డు మీద వదులుతాడు రోడ్డు మీద ఆ పదం సంచరిస్తూ మనిషికి ఢీకొన్నప్పుడు ఒక పేలుడు సంభవిస్తుంది. అదే కవిత్వం.. ఇక్కడ చదివిన కవితలన్నీ ఎవరెవరినో ఢీకొంటాయి. రకరకాల పేలుళ్ళు సంభవిస్తాయి. ఇక్కడ జరిగిన ఈ కవి సమ్మేళనమే ఒక పెద్ద 'పేలుడు' అని కవిత్వానికి కొత్త అర్థం చెప్పి అందరిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

శ్రీశ్రీ విశ్వేశ్వరరావు ఈ సమ్మేళనానికి వచ్చి కవులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇకనుంచి ప్రతి ఏడాదీ జనవరి 1న విజయవాడలో కవి సమ్మేళనం తప్పక జరుపుకోవాలనే ఉద్దేశంతో 'ఒక కలయిక - అనేక కలాలు' కార్యక్రమాన్ని తంగిరాల సోనీ, అనిల్ డ్యానీని సంప్రదించి రూపకల్పన చేశారు ప్రముఖ సీనియర్ కవి శిఖా ఆకాష్. ఈ కార్యక్రమాన్నీ ఆసాంతం వీక్షించేందుకు చిలకలూరిపేట నుంచి ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ విచ్చేసారు. "మనుషుల్ని విడదీసి పాలిస్తూ, వేధిస్తున్న అంధయుగపు పాలకులు రాజ్యం చేస్తున్న ఈ కాలంలో ప్రగతిని కాంక్షించే కలాలు మరింత పదునెక్కాలి, బలపడాలి" అంటూ సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ ఒక సందేశాన్ని పంపించారు. సభ ఆద్యంతం ఎంతో ఉత్తేజంతో సాగింది. ఇకనుంచి ప్రతినెలా విజయవాడలో ఆత్మీయ సాహిత్య సమావేశాలు, సభలు, కవి సమ్మేళనాలు కొనసాగించుకోవాలని వచ్చిన కవులు అందరూ అభిప్రాయపడ్డారు.

- అమూల్యచందు కప్పగంతు
9059824800

సంకెళ్ళను తెంచుకున్న ఐఏఎస్ ఆత్మ కథ

పుస్తకం

మనుధర్మం సృష్టించిన సామాజిక వైరుధ్యాలను, ఆ కారణంగా ఏర్పడిన కుల వ్యవస్థ, అస్పృశ్యత, అంటరానితనాలను అనుభవిస్తూ ఛీత్కారాలను, అవహేళనలను ఎదుర్కొంటూ ఉన్న సామాజిక సమూహంలో జన్మించి దేశంలోనే ఒక అతిపెద్ద రాష్ట్రానికి చీఫ్ సెక్రటరీ స్థాయికి ఎదిగి, ఆ వర్గాల అభ్యున్నతే కాక ఆ రాష్ట్ర దిశా నిర్దేశాలను ప్రభావితం చేసిన ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు. ఆయన రాసిన జీవన ప్రస్థానం 'సంకెళ్ళను తెంచుకుంటూ....' ఓ దళిత చీఫ్ సెక్రటరీ ఆత్మకథ'. ప్రజాస్వామ్య రాజ్యాధికారాన్ని పేదలకు అందదండలందించే సాధనంగా మలచిన స్ఫూర్తిదాయకమైన అధికారి తన ప్రస్థానాన్ని ఆవిష్కరించిన అక్షర కెరటం ఈ పుస్తకం. రచయిత తన పుట్టిన సంవత్సరం తనకు తెలియదంటూ తెలపడంలో ఏ విధమైన బేషజానికి తావివ్వలేదు. తన తల్లిదండ్రులు నిరుపేదలు, నిరక్షరాస్యులు కావడంతో తన పుట్టిన తేదీని నమోదు చేయలేదని, 1940 అని సంవతసరం నమోదైందని తన కుటుంబ నేపథ్యాన్ని చెప్పకనే చెప్పారు. ఆ కాలంలో తనను ప్రోత్సహించిన వ్యక్తులను ఏమాత్రం మరిచిపోకుండా వారి పేర్లను పొందుపరిచారు. ఇది ఆయన కృతజ్ఞతాపూర్వకమైన మనస్తత్వానికి నిదర్శనం. తాను జన్మించిన కృష్ణా జిల్లా పెద మద్దాలి గ్రామ భౌగోళిక స్వరూపం, గ్రామీణ నేపథ్యాన్ని వివరించారు. దళిత సాహితీవేత్త పద్మశ్రీ బోయి భీమన్నతో తనకున్న సాన్నిహిత్యాన్ని, ఆయన రచించిన 'పాలేరు' నాటకంలో కథానాయకుడి నేపథ్యాన్ని తన ఎదుగుదలతో పోల్చుకున్నారు. ఆ నాటకంలోని కొన్ని పంక్తులను పేర్కొన్నారు. తద్వారా తాను పాలేరు కొడుకునని సగర్వంగా చెప్పుకునేందుకు ఏమాత్రం వెనుకాడలేదు. ఆ నాటకాన్ని తాను ఇంగ్లీషులోకి అనువదించానని పేర్కొన్నారు. సామాజిక అణిచివేతల అధిగమింపునకు పాలేరు నాటకం ఒక 'అక్షర ఖడ్గం'గా రూపొందిందని అన్నారు. మహాకవి గుర్రం జాషువా కలం నుంచి జాలువారిన 'గబ్బిలం' లోని ఒక కవితను సైతం పొందుపరిచి ఆ రచనల ప్రభావం తనపై ఎంతగా ఉన్నదో తేటతెల్లం చేశారు. ప్రముఖ కవి విలియం వర్డ్స్ వర్త్ ప్రచురించిన 'డాఫోడిల్స్' కవిత తెలుగు అనువాదాన్ని పొందు పరచడం ద్వారా తన హాస్టల్ జీవితంలో బహిరంగ మరుగుదొడ్ల అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. తద్వారా మరుగుదొడ్లను శుభ్ర పరుస్తూ దుర్భర జీవితం గడుపుతున్న పారిశుద్ధ్య కార్మికుల జీవితాలను ఆయన స్పృశించారు.

1961లో తాను యూపీఎస్సీ పరీక్షలు రాసి, అనంతరం ఇంటర్వ్యూకు హాజరైన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ దగ్గరలోని నగరానికి వెళ్లి ఉలెన్ సూట్ కుట్టించుకున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇంటర్వ్యూ చేసిన నిపుణులు దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా ఎన్నికైన దామోదరం సంజీవయ్యపై తన అభిప్రాయాలను కోరగా తాను చెప్పిన సమాధానాన్ని గుర్తుచేసుకున్నారు. ఐఏఎస్‌కు ఎంపికైన తర్వాత తన తల్లితండ్రుల స్పందనను తెలుపుతూ ... ముఖ్యంగా తన తల్లి చెప్పిన మాటలను ఇలా గుర్తు చేసుకున్నారు : "మీ నాన్న పేరున్న పాలేరు. ఈ ఊర్లోనే కాదు, చుట్టుపక్కల ఊళ్ళలోనూ ఆయనను మంచిగా చెప్పుకుంటారు. ఆయన నిజాయితీ, పనితనం, కష్టపడి పనిచేయడం ద్వారా ఆ పేరు సంపాదించుకున్నారు. మీ నాన్న మంచి పాలేరుగా పేరు తెచ్చుకున్నట్లుగానే, నువ్వు నీ ఉద్యోగంలో కష్టపడి పనిచేసి అత్యంత ఉన్నత పదవులు అందుకోవాలి. నిరుపేదలకు, అవసరాల్లో ఉన్నవారికి సహాయం చెయ్యాలి' అని తల్లి చెప్పిన మాటలు తన జీవితం ఆసాంతం ప్రభావం చూపాయని చెప్పు కున్నారు. ఐఏఎస్ అధికారి అయిన తరువాత తన ఊరికి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, ఎస్సీ ఎస్టీలకు చేసిన సంక్షేమ కార్యక్రమాలను, ముస్సోరిలో శిక్షణ జ్ఞాపకాలను, ఐఏఎస్ అధికారిగా ఎంపికైన తొలినాళ్లలో అసిస్టెంట్ కలెక్టరుగా, సబ్ కలెక్టర్‌గా, ఢిల్లీలో అండర్ సెక్రటరీగా పనిచేసిన రోజులు సవివరంగా వివరించారు. వరంగల్ కలెక్టరుగా ఉన్న సమయంలో నిరుపేదల సంక్షేమానికి కట్టుబడి, ప్రభుత్వాన్ని వారి వద్దకు చేర్చాలనే సంకల్పంతో తాను చేసిన కార్యక్రమాలను కొందరు తప్పుగా ప్రచారం చేసి 'నక్సలైట్ కలెక్టరు'గా ముద్ర వేసి ఇబ్బందులకు గురి చేశారంటూ, నాటి చేదు అనుభవాలను తేటతెల్లం చేశారు. నిరుపేదల పక్షాన నిలిచేందుకు కులం అడ్డు రాదని నిరూపించిన ఎస్.ఆర్.శంకరన్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని రచయిత పలు సందర్భాలను ఉదహరించారు. శంకరన్‌ను తన గురువుగా ప్రస్తావించారు. ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఆత్మకథలో 'వరంగల్ కలెక్టరుగా మాధవరావు చేసిన కృషి నా జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది, అణగారిన వర్గాల్లో వ్యక్తులకు ఎదురయ్యే ఛీత్కారాలు, అవమానాలు నుంచి ఒక వ్యక్తి ఉన్నత స్థాయికి ఎలా చేరుకోవచ్చు అనేది ఆయన స్ఫూర్తితోనే నేను నా లక్ష్యాలను చేరుకున్నాను' అంటూ పేర్కొన్న విషయాలను ప్రస్తావించారు. సాంఘిక సంక్షేమ శాఖ, షెడ్యూల్ కులాల సహకార ఆర్థిక సంస్థల ఉన్నతాధికారిగా తాను చేసిన విప్లవాత్మక మార్పులు, వెట్టిచాకిరి నిర్మూలనకు తాను చేసిన కృషిని, ఆర్థిక శాఖ వంటి ముఖ్యమైన శాఖలో కీలకంగా వ్యవహరించిన తీరు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా తాను ఎంపికైన విధానం, ఆ సందర్భంగా రాష్ట్ర పాలనలో క్రియాశీలక భూమిక పై ఈ రచనలో శ్వేతపత్రాన్ని ఆవిష్కరించారు. తాను పనిచేసిన ముఖ్యమంత్రుల ప్రస్తావనతో పాటు, సన్నిహితంగా పనిచేసిన నేదురుమల్లి జనార్దన రెడ్డి, చంద్రబాబుల వద్ద ప్రజల పక్షాన నిలబడేందుకు మాత్రమే తాను ప్రాధాన్యతను ఇచ్చానంటూ పేర్కొన్నారు. ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఉన్న అనుభవంతో తన మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా చేరాలంటూ చంద్రబాబు ప్రతిపాదించారని, తాను సున్నితంగా తిరస్కరించానని తెలిపారు. టి.అంజయ్యతో పనిచేసిన సందర్భంలో 'బిల్డింగ్ బైలాస్' మార్చడానికి ఉద్దేశించిన ఫైలును నిర్ద్వంద్వంగా తిరస్కరించానని, ఇది నియమ నిబంధనలకు వ్యతిరేకమైనదిగా ఆయనకు స్పష్టం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన సందర్భంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్న పరిస్థితిని అధిగమించేందుకు నియమ నిబంధనలు రూపొందించిన వైనాన్ని తెలిపారు. తనలోని గాయకుడిని కూడా ఈ సందర్భంగా పరిచయం చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టబద్ధత కోసం జరిగిన ఉద్యమంలో ఉక్కు సంకెళ్ళకు వెనుకాడ లేదంటూ, ఒక సామాజిక సమస్యపై అరెస్టయిన మాజీ చీఫ్ సెక్రటరీగా తన రికార్డును భవిష్యత్తులో కూడా ఎవరు చేరుకోలేరేమో అంటూ నేటితరం అధికారులకు బాధ్యతను గుర్తుచేశారు. దళిత, గిరిజన వర్గాల అభ్యున్నతికి వారి నిధులను వారికే ఖర్చు చేయాలనే సంకల్పంతో ఆనాటి ఉద్యమంలో సిపిఎం కీలక భూమిక పోషించిందని గుర్తు చేసుకున్నారు. అంబేద్కర్, మార్క్స్ మధ్య వారధి నిర్మించే క్రమంలో తాను ముందు ఉంటానని, భారతదేశంలో కులం, వర్గం అవిభాజ్య మైనవి అంటూ స్పష్టం చేశారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల బిడ్డగా జన్మించి, కులం సంకెళ్ళను తెంచుకొని, ఆత్మవిశ్వాసంతో ఒక రాష్ట్ర చీఫ్ సెక్రటరీ స్థాయికి ఎదిగి చూపించిన విధానాన్ని, పేదరికం అసమానత, సామాజిక అణచివేతలను అధిగమించిన తీరును కళ్ళకు కట్టినట్టు వివరించిందీ పుస్తకం. అంటరానితనం, అణచివేత, ఆధిపత్య అధికారాలను ధిక్కరించి ఆత్మగౌరవంతో ఎదిగి భావితరాలకు స్ఫూర్తి చిహ్నంగా నిలిచిన ఒక మాజీ ఐఏఎస్ అధికారి ఆదర్శనీయమైన జీవితాన్ని ఆవిష్కరించిన పుస్తకంగా ఇది చరిత్రలో నిలుస్తుంది.



- నేలపూడి స్టాలిన్ బాబు,
83746 69988

నేడు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార సభ

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కారాలను ప్రముఖ రచయిత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు, పరివర్తన పత్రిక సంపాదకులు కొరివి వినయ్ కుమార్, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రముఖ కవి పాపినేని శివశంకర్‌లకు ఈ ఏడాది ఇస్తున్నాము. సాహిత్య సామాజిక రంగాల్లో విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాలను జనవరి 9, 2023 సోమవారం సాయంత్రం 5 గంటలకు జరిగే సభలో ప్రదానం చేస్తున్నాము. ఈ సందర్భంగా జరిగే సభలో త్రిపురనేని రామస్వామి చౌదరి - సమకాలీనత అంశంపై ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ ప్రసంగిస్తారు. కవి, జర్నలిస్ట్ బి విల్సన్ అధ్యక్షత వహిస్తారు. కడియం జేమ్స్, బి.శ్యాంబాబు పాల్గొంటారు.

కవితల పోటీ ఫలితాలు

వసుంధర విజ్ఞాన వికాస మండలి నిర్వహించిన కర్కముత్తారెడ్డి స్మారక రాష్ట్ర స్థాయి విద్యార్థుల కవితల పోటీకి వచ్చిన మొత్తం కవితల నుంచి ఐదు ఉత్తమ కవితలు ఎంపిక చేస్తామని ప్రకటించినప్పటికీ విద్యార్థులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో మొత్తం 9 కవితలను ఎంపిక చేశాం. జె.వైష్ణవి (టీఎంఆర్ఎస్ గర్ల్స్) బాలానగర్, నాగోల్, చిన్మయి (విజయవాడ), సి.హెచ్.సాయి (జెడ్పీహెచ్ఎస్) బొల్లారం, జిన్నారం, సి.హెచ్.ప్రేరణ, అభిలాష్ శర్మ, విజయ హైస్కూల్, నిజామాబాద్, సాయికీర్తన (జెడ్పీహెచ్ఎస్) మార్కాపురం, ప్రకాశం జిల్లా; జె.రమ్య (టీఎంఆర్ఎస్ గర్ల్స్) బాలానగర్, నాగోల్, కొలుపుల నందిని (జెడ్పీహెచ్ఎస్), దుగ్గొండి, వరంగల్; పద్మీ (జెడ్పీహెచ్ఎస్) లక్ష్మీపురం విజేతలుగా ఎంపికయ్యారు. వీరికి త్వరలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బహుమతి ప్రదానం చేస్తాము.

- వి.మధుకర్, వ్యవస్థాపకులు,
సుమలత, కన్వీనర్, వసుంధర విజ్ఞాన వికాసమండలి

కవితా సంపుటాలకు ఆహ్వానం

బాపురం గురురాజారావు కవితా పురస్కారం కొరకు 2022లో ముద్రితమైన వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. ఈ పోటీకిగాను కవితా సంపుటాలు మూడేసి ప్రతులు ఫిబ్రవరి 20 లోగా పంపాలి. విజేతకు జ్ఞాపికతో పాటు రూ.7500 నగదు అందజేస్తాం. సంపుటాలు పంపాల్సిన చిరునామా : K.V Meghanath Reddy, H.No. 11/21/01, NGOs colony, Puttur - 517583, Tirupathi (D), AP. 6300318230. వివరాలకు : కె.వి. మేఘనాథ్ రెడ్డి, 63003 18230.

పాలమూరు సాహితి అవార్డుకు ఆహ్వానం

తెలుగులో ఉత్తమ వచన కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్న కవులకు ఏటా పాలమూరు సాహితీ అవార్డులను ప్రదానం చేస్తున్న సంగతి తెలిసిందే. గతంలో ఈ అవార్డును ప్రముఖ కవులు డా. రాధేయ, డా. కాసుల లింగారెడ్డి, డా. పెన్నా శివరామకృష్ణ, కందుకూరి శ్రీరాములు, అంబటి నారాయణ, ఎస్.హరగోపాల్, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, చిత్తలూరి సత్యనారాయణ, తగుళ్ళ గోపాల్ అందుకున్నారు. ఈ పురస్కారం కోసం 2021లో ముద్రితమైన వచన కవితా సంపుటాలను మూడేసి ప్రతులను పంపించాల్సిందిగా కోరుతున్నాం. కవులు తమ ప్రతులను డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఇ.నం. 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్ - 509001 చిరునామాకు 2023 మే 31 లోపు పంపాలి.ఉత్తమ వచన కవితా సంపుటికి రూ.5,116 నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేస్తారు.

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, వ్యవస్థాపకులు
పాలమూరు సాహితి అవార్డు .. 90328 44017

అవకాశాల్లోనూ సగం

- ఐద్వా మహాసభలో ప్రతినిధుల డిమాండ్
- కేరళ తరహా ప్రభుత్వాలు కావాలన్న ఆశాభావం

ఎం.సి.జోసఫిన్ నగర్ (తిరువనంతపురం) నుండి ప్రజాశక్తి ప్రతినిధి

ఉత్పత్తిలో సగభాగంగా ఉన్న మహిళాలోకానికి అవకాశాల్లోనూ, నిర్ణయాధికాల్లోనూ సగభాగం ఇవ్వాలని ఐద్వా జాతీయ మహాసభలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యదర్శి నివేదికపై చర్చలు మూడవరోజైన ఆదివారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా తమ తమ రాష్ట్రాల తరపున మాట్లాడిన పలువురు కేరళలో మహిళల అభివృద్ధి కోసం ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఆ తరహా ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లోనూ ఏర్పాటు కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

సౌహార్ద సందేశమిచ్చిన కేరళ డివైఎఫ్ఐ కార్యదర్శి రహీం వామపక్ష పార్టీలు అధికారంలోకి వస్తేనే మహిళల అభివృద్ధితో పాటు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.



మహాసభకు హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సుభాషిణీ ఆలీ

ఉద్యమాలు ఉధృతం చేస్తాం...

గుజరాత్ నుండి చర్చల్లో పాల్గొన్న హన్నా మాట్లాడుతూ తమ రాష్ట్రంలో ప్రజలు అత్యంత భయంకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. మోడీ ప్రభుత్వం గుజరాత్ గురించి చేసుకుంటున్న ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. రానున్న రోజులో ఉద్యమాలను ఉధృతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు.

పశ్చిమ బెంగాల్ ప్రతినిధి మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్ గూండాల దాడులను ఎదుర్కొంటూ తాము పోరాటాలను చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అభ్యుదయ శక్తులను కలుపుకుని ఐక్య పోరాటాలు చేస్తామని తెలిపారు.

లింగ సమానత్వంపై దృష్టి...

కేరళ ప్రతినిధి బిందు మాట్లాడుతూ తమ రాష్ట్రంలో పినరయ్ విజయన్ నాయకత్వంలో వామపక్ష ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. మూఢ విశ్వాసాల కారణంగా మహిళలు హింసకు, లైంగిక దాడులకు గురవుతున్నారని, అటువంటి సంఘటనలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నామని, ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి పని చేస్తామని తెలిపారు.

హింసకు వ్యతిరేకంగా...

తెలంగాణలో మహిళలపై హింసకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నట్లు ఆ రాష్ట్రం తరపున చర్చల్లో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గీత అన్నారు. అనేక జిల్లాల్లో లీగల్ సెల్స్ ఏర్పాటు చేసి మహిళలకు ఉచిత న్యాయసలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇళ్ళులేని పేదలకు గుడిసెలు వేయించడంలో, పట్టాలు ఇప్పించడంలో ఐద్వా కీలకపాత్ర పోషించిందని అన్నారు. ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ రాష్ట్రం నుండే చర్చల్లో పాల్గొన్న సృజన మాట్లాడుతూ కార్యకర్తలను అభివద్ధి చేసుకునేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

370 ఆర్టికల్ అమలు చేయాలి .

మొదటిసారి ఐద్వా మహాసభకు హాజరైన కాశ్మీర్ ప్రతినిధుల తరపున లతీఫా మాట్లాడుతూ . జమ్ము, కాశ్మీర్ లో పరిస్థితి గతంలో మాదిరి పరిస్థితులు లేవన్నారు. తమ గురించి ఆలోచించకుండా మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీల కోసం ఆర్టికల్ 370ని రద్దు చేశారని ఫలితంగా భూమిపై తమకు హక్కు లేకుండా పోయిందని తెలిపారు.ఆర్టికల్ 370ని తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దాడులకు భయపడం...

త్రిపుర నుండి చర్చల్లో పాల్గొన్న రూపా గంగూలి మాట్లాడుతూ అధికారంలో ఉన్న బిజెపి పెద్ద ఎత్తున దాడులకు దిగుతోందని చెప్పారు. సమావేశాలకు హాజరైతే చంపేస్తామని బెదిరిస్తున్నారని, ఇళ్ల, ఆఫీసులను తగలబెడుతున్నారని చెప్పారు. లైంగిక దాడులు భారీగా పెరిగాయని అన్నారు. ఆ దాడులకు భయపడకుండా ఐద్వా నేతృత్వంలో రాష్ట్రంలో పోరాటాలు చేస్తున్నామని చెప్పారు.

మనువాదాన్ని తిప్పికొట్టాలి

కర్ణాటకలో పేదల కోసం తాము ఎన్నో పోరాటాలు చేశామని ఆ రాష్ట్రం నుండి చర్చల్లో పాల్గొన్న మీనాక్షి చెప్పారు. పేదలకు పని దొరికేలా, వేతనాలు దొరికేలా చేసిన ఎన్నో పోరాటాలు ఫలించాయని అన్నారు. పేదల పొట్ట నింపడానికి తాము పనిచేస్తుంటే, మతోన్మాదులు హిందుత్వ ఆయుధంతో వారి బుర్రలను చెడగొడుతున్నారని అన్నారు. అందువల్ల మతోన్మాదాన్ని, మనువాదాన్ని తిప్పి కొట్టాలని చెప్పారు.

మతోన్మాదమే బిజెపి అజెండా

మణిపూర్‌లో అధికారంలో ఉన్న బిజెపి ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని ఆ రాష్ట్రం నుండి చర్చల్లో పాల్గొన్న ఆశాబాలా చెప్పారు. మరోవైపు పూట గడవక మైక్రోఫైనాన్స్‌ల వద్ద ప్రజలు అప్పులు చేస్తున్నారని, వడ్డీలు కట్టలేక, వారి ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు.

మధ్యతరగతికి చేరువుగా

మధ్యతరగతి మహిళలకు చేరువయ్యేలా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నుండి చర్చల్లో పాల్గొన్న మస్తాన్‌బీ తెలిపారు. దాదాపు రెండు సంవత్సరాలుగా సాగుతున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో మహిళాసంఘం మొదటినుండి చురుకుగా పాల్గొంటోందని చెప్పారు. ఫలితంగా ఆ కుటుంబాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున పోరాటాల్లోకి వస్తున్నారన్నారు. అదే విధంగా లైంగిక వేధింపులు, హింస తదితర సంఘటనలపై కూడా ఎప్పటికప్పుడు ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. మతోన్మాదం, మనువాదాలకు వ్యతిరేకంగా మహిళలను చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. చర్చల్లో పాల్గొన్న మరో ప్రతినిధి సత్యవతి మాట్లాడుతూ యువతులను ఉద్యమంలోకి తీసుకు రావడానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా గ్రూపుల ద్వారా సమస్యలపై ఎప్పటికప్పుడు చైతన్యవంతం చేయడం, అవసరమైనప్పుడు ప్రత్యక్ష కార్యాచరణకు సమీకరించడం వంటి చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు.

కార్మిక వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదించండి

సిఐటియు ర్యాలీలో మాణిక్ సర్కార్ పిలుపు

అగర్తలా : త్రిపుర రక్షణ కోసం రాజకీయ పోరాటానికి కార్మికులంతా సిద్ధం కావాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ, ప్రజాస్వామ్య వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బిజెపిని గద్దెదింపాలని అన్నారు. సిఐటియు ఆధ్వర్యాన అగర్తలాలోని స్వామి వివేకానంద గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం తక్షణ అవసరమని అన్నారు. తప్పుడు వాగ్దానాలు, భారీగా డబ్బు కుమ్మరించడం, భద్రతా బలగాల మోహరింపు తదితరాలతో ఎన్నికల్లో గెలవాలని బిజెపి ప్రయత్నిస్తోందని చెప్పారు. బిజెపి కుయుక్తులను తిప్పికొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అంతకుముందు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితిన్ చౌదరి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, మాజీ మంత్రి మాణిక్ దేవ్, శంకర్ ప్రసాద్ దత్తా, పాంచాలి భట్టాచార్య తదితరులు ప్రసంగించారు.

వయనాడ్‌లో ఎంఎస్‌ఎంఇ ల సమావేశంలో మాట్లాడుతున్న కేరళ మంత్రి పి రాజీవ్

8 నెలల్లోనే లక్ష ఎంఎస్‌ఎంఇలు

- కేరళ పారిశ్రామిక విధానానికి కేంద్రం ప్రశంసలు
- దేశంలోనే అత్యుత్తమ విధానంగా గుర్తింపు
- కొత్తగా 2,56,140 మందికి ఉద్యోగాలు

న్యూఢిల్లీ : కేరళ పరిశ్రమల శాఖ ఒక్క ఏడాదిలోనే ఒక లక్ష సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)లను స్థాపించడం ద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు పొందింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల జాతీయ సదస్సులో కేంద్ర ప్రభుత్వం కేరళలోని పరిశ్రమల శాఖ వ్యవస్థాపక సంవత్సర పథకాన్ని దేశంలోనే అత్యుత్తమ విధానంగా పేర్కొంది. కేరళతో పాటు ఉత్తరప్రదేశ్ ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి ప్రాజెక్టును కూడా ప్రశంసించింది. మార్చి 30న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇయర్‌ను ప్రారంభించారు. లక్ష ఎంఎస్‌ఎంఇలను ఏడాదిలో ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, నవంబర్ నాటికే అంటే ఎనిమిది నెలల్లోనే ఆ లక్ష్యాన్ని పూర్తి చేశారు.

ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నవంబర్‌లోనే పూర్తయింది. ఈ సందర్భంగా కేరళ పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ మాట్లాడుతూ మనదేశంలో ఇదో కొత్త చరిత్రని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, కొత్తగా మహిళలను భాగస్వామ్యం చేయడం ద్వారా ఏడాది పూర్తికాకుండానే 1,01,353 సంస్థలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రాజెక్టు ద్వారా కేరళలో రూ.6,282 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 2,20,500 మందికి ఉపాధి లభించిందని తెలిపారు. ప్రాజెక్ట్ ప్రారంభించిన 235 రోజుల తర్వాత ఈ ఘనత సాధించినట్లు కేంద్రం గుర్తించి, నివేదికలో ప్రత్యేకంగా పేర్కొంది. లక్ష్యం పూర్తయిన రోజు నాటికి ఉన్న సమాచారం ప్రకారం వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అత్యధికంగా 40,622 మంది ఉపాధి పొందారు. 16129 ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభించడం ద్వారా రూ.963.68 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆ తరువాత గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగంలో 22,312 ఉద్యోగాలు వచ్చాయి. ఈ రంగంలో 10,743 ఎంటర్‌ప్రైజెస్, రూ.474 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ రంగంలో 7,454 ఉద్యోగాలు, 4014 ఎంటర్‌ప్రైజెస్, రూ. 241 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సేవా రంగంలో 7,048 ఎంటర్‌ప్రైజెస్ రిజిస్టర్ అయ్యాయి. ఈ రంగంలో రూ.428 కోట్ల పెట్టుబడులు, 16156 ఉద్యోగాలు లభించాయి. వ్యాపార రంగంలో అత్యధిక ఉద్యోగాలు వచ్చాయి. 54,108 ఉద్యోగాలు కల్పించడానికి 29428 ఎంటర్‌ప్రైజెస్, రూ.1652 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మొత్తంగా ఆదివారం నాటికి కొత్తగా రూపొందించిన అంచనా ప్రకారం ఇప్పటివరకు 7261.54 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. 118509 సంస్థల ఏర్పాటు ద్వారా 2,56,140 ఉద్యోగాలు కొత్తగా వచ్చాయి. స్థానిక ప్రభుత్వ స్థాయిలో లక్ష ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభించడానికి సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించడానికి అన్ని స్థానిక సంస్థలలో 1153 మంది వృత్తిపరంగా అర్హత కలిగిన వారిని నియమించారు.

హిమాచల్ కేబినెట్ విస్తరణ

సిమ్లా : హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు. మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ కుమారుడు విక్రమాదిత్య సింగ్‌తో సహ మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం రాజ్‌భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ కొత్తగా చేరిన మంత్రులతో ప్రమాణం చేయించారు. సోలన్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ధనిరామ్ షాండిల్ తొలిసారిగా మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రా నుండి చందర్ కుమార్, సిర్మౌర్ నుండి హర్షవర్ధన్ చౌహాన్, కిన్నౌర్‌నుండి జగత్‌సింగ్ నేగీ, సిమ్లా నుండి విక్రమాదిత్య సింగ్, అనిరుధ్ సింగ్, రోహిత్ ఠాకూర్ ఉన్నారు. అలాగే సుందర్ సింగ్ ఠాకూర్, మోహన్‌లాల్ బ్రాక్తా, రామ్ కుమార్ చౌదరి, ఆశిష్ బుటైల్, కిషోరి లాల్, సంజయ్ అవస్తీలను ప్రధాన పార్లమెంటరీ కార్యదర్శులుగా ప్రమాణ స్వీకారం చేశారు. శీతాకాల సమావేశాల సమయంలో ఢిల్లీకి వెళ్లిన సుఖు మూడు రోజులుగా పార్టీ సీనియర్ నేతలతో చర్చలు జరుపుతున్నారు. 68 మంది సభ్యులున్న సభలో కాంగ్రెస్‌కు మొత్తం 40 మంది శాసనసభ్యులు ఉన్నారు.

'బిల్కిస్ బానో' నేరస్తులను జైలుకు పంపండి

- ఐద్వా మహాసభలో డిమాండ్

ఎంసి జోసిఫిన్ నగర్ (తిరువనంతపురం) నుండి ప్రజాశక్తి ప్రతినిధి

బిల్కిన్ బానో కేసులో 11 మంది నేరస్తులకు గుజరాత్ ప్రభుత్వం పెట్టిన క్షమాభిక్షను తక్షణం రద్దు చేసి వారిని జైలుకు పంపాలని ఐద్వా మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రతిపాదించిన తీర్మానాన్ని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీనితో పాటు గుజరాత్ దాడుల ఘటనలో బాధితులకు న్యాయం చేయాలని మహాసభ కోరింది. బిల్కిన్‌బానో కుటుంబంపై అమానుష హత్యాకాండ చేయడంతో పాటు సామూహిక మానభంగానికి పాల్పడ్డ నేరస్తులకు క్షమాభిక్ష ప్రకటించడం దిగ్భ్రాంతి కలిగించిందని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ అమానుష సంఘటనలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను కూడా గుజరాత్ ప్రభుత్వం అమలు పరచలేదని తెలిపారు. బికిన్‌బానోకు 50 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని, ఆమెకు ఇంటితో పాటు ఉద్యోగం కూడా ఇవ్వాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను గుజరాత్ ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదని, అదే సమయంలో అమానుష కాండకు పాల్పడిన నేరస్తులకు క్షమాభిక్ష పెట్టిందని తెలిపారు. ఇది న్యాయస్థానాలను సవాల్ చేయడమేనని అన్నారు. ఇప్పటికైనా న్యాయస్థానాలు స్పందించి, క్షమాభిక్ష రద్దుచేసి నేరస్తులను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. బిల్కిన్‌బానోకు న్యాయం చేయడానికి ప్రజాతంత్ర వాదులు, అభ్యదయ శక్తులు కలిసి రావాలని కోరారు. ఈ సంఘటనలో వాస్తవాలు వెలికితీసుకురావడానికి ప్రయత్నించిన హక్కుల కార్యకర్తలు తీస్తా సెతల్వాద్, ఆర్.శ్రీకుమార్, సంజీవ్‌భట్‌లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని మహిళాసంఘం డిమాండ్ చేసింది. హర్యానాలో జూనియర్‌కోచ్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన క్రీడల మంత్రి సందీప్‌సింగ్‌ను తక్షణం డిస్మిస్ చేయాలని మహాసభ తీర్మానించింది. ఉద్యమకారులపై, అభ్యుదయవాదులు, జర్నలిస్టులపై ఇటీవల కాలంలో పెరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మహిళలకు మహాసభ సంఘీభావం తెలిపింది,. ఉపాధి హామీ పథకాన్ని చట్ట ప్రకారం అమలు చేయాలని, పట్టణ ప్రాంతంలో కూడా ఈ పథకాన్ని తీసుకురావాలని మరో తీర్మానంలో మహాసభ కోరింది.

మహిళా శరణార్ధుల పట్ల మానవత్వ విధానం

అంతర్జాతీయ సంక్షోభాల కారణంగా శరణార్థులుగా దేశంలోకి వస్తున్న మహిళలపట్ల మానవత్వంతో వ్యవహరించాలని, ఆ మేరకు ఒక విధానాన్ని రూపొందించాలని ఐద్వా జాతీయ మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సంక్షోభాలతో నిండిన పెట్టుబడిదారీ విధానం వలసలను అనివార్యం చేసిందని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. మెరుగైన పేదరికం, ఆకలి నుండి తప్పించుకోవడానికి గ్రామాల నుండి పట్టణాలకు, పట్టణాల నుండి నగరాలకు, ఒక దేశం నుండి మరో దేశానికి తరలి వెళ్లడం అనివార్యంగా మారిందని తెలిపారు. దేశాల మధ్య చోటుచేసుకుంటున్న ఉద్రిక్తతలు, యుద్ధాలు కూడా వలసలకు కారణమవుతున్నాయన్నారు. బంగ్లాదేశ్. శ్రీలంక, మయన్మార్‌ల నుండి ఇలా మన దేశానికి దాదాపుగా 2 లక్షల మంది వలస వచ్చారని పేర్కొన్నారు. వీరిలో మహిళలు కూడా ఎక్కువగా ఉన్నారని తెలిపారు. హిందుత్వ మతోన్మాద శక్తులు వీరిపై రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు అంటూ మహిళల అపహరణ, లైంగిక దాడులు, హత్యలు వంటిదారుణాలకు పాల్పడుతున్నారని, పౌరసత్వం చుట్టూ వివాదాలు లేవనెత్తుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని మహిళా శరణార్థుల పట్ల మానవత్వంతో కూడిన విధానాన్ని అమలు చేయాలని కోరారు.

గంగా ముంపు బాధితులను ఆదుకోండి

పశ్చిమబెంగాల్‌లో గంగానది వరద కట్టలు కొట్టుకుపోవడం వల్ల ప్రతి సంవత్సరం ముంపు బారిన పడుతున్న ప్రజానీకాన్ని ఆదుకోవాలని మరో తీర్మానంలో ఐద్వా డిమాండ్ చేసింది. అధికారిక లెక్కల ప్రకారమే ప్రతి సంవత్సరం 8 చ.కి,మి.మేర భూమిని గత ఐదు సంవత్సరాలుగా గంగలో కలిసిపోతోందని తీర్మానంలో పేర్కొన్నారు. ఒక్క మాల్దా జిల్లాలోనే 2021వ సంవత్సరంలో 4,500 కుటుంబాలు ఇళ్లను పోగొట్టుకున్నాయని తెలిపారు.

లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంలో జ్యోతిబసు ముఖ్యమంత్రి గా ఉన్నసమయంలోనే ఇక్కడ భూ క్షయాన్ని అరికట్టేందుకు కొన్ని చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం సమస్య తీవ్రమౌతున్న దృష్ట్యా ప్రభుత్వం తక్షణం స్పందించాలని, బాధితులను ఆదుకోవాలని కోరారు.

ట్రాన్స్‌జెండర్లుకు సభ్యత్వం

ఐద్వాలో ట్రాన్స్‌జెండర్లకు సభ్యత్వం కల్పించేలా నిబంధనలను సవరించారు. ఈ మేరకు ఐద్వా రాజ్యాంగానికి ఆ సంఘ జాతీయ నాయకులు సుభాషిణి ఆలీ ప్రవేశపెట్టిన సవరణను మహాసభ ఆమోదించింది. 15 సంవత్సరాలు అంతకు మించి వయసు ఉన్న మహిళ, లేదా ట్రాన్స్ జెండర్లు ఐద్వా లక్ష్యాలను ఆమోదించి, నిర్దేశించిన ఎరుసుము చెల్లిస్తే వారికి సభ్యత్వం ఇయ్యవచ్చని సవరణలో పేర్కొన్నారు,.

దుండగుడి వీరంగం

- 18 శిలువలు.. సమాధులు ధ్వంసం
- ముంబయిలో ఒక చర్చికి ఆనుకొని ఉన్న శ్మశానంలో ఘటన

ముంబయి : మహారాష్ట్రలోని ముంబయి నగరంలో సంఘ విద్రోహ శక్తులు అలజడి సృష్టించే ప్రయత్నం చేశాయి. సబర్బన్ మహిమ్‌లో గల ఒక చర్చికి ఆనుకొని ఉన్న శ్మశానంలోని సమాధులు, శిలువలను గుర్తు తెలియని ఒక వ్యక్తి ధ్వంసం చేశాడని పోలీసులు తెలిపారు. పోలీసులు, చర్చి ఉద్యోగులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. సెయింట్ మైఖేల్ చర్చిలో ఈ ఘటన జరిగింది. ఆదివారం ఉదయం చర్చి ఉద్యోగులు 18 శిలువలు పగిలిపోయినట్టు గుర్తించారు. ఉదయం సమయంలో చర్చిలోకి ప్రవేశించిన దుండగుడు శ్మశానంలోని 18 శిలువలను ధ్వంసం చేశాడని చర్చి ఒక ప్రకటనలో పేర్కొన్నది. నిందితుడిని అరెస్టు చేసి తగిన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చినట్టు వివరించింది. ఈ ఘటనపై ఐపీసీలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన మహిమ్ పోలీసులు.. చర్చి పరిసర ప్రాంతాల్లో ఉన్న సిసి టివి ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ముంబయిలో శాంతియుతంగా ఉన్న వాతావరణాన్ని చెడగొట్టేందుకు ఎవరో ఉద్దేశపూర్వకంగా చేసిన ఘటనలా ఇది కనిపిస్తున్నదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో ఈ ఘటనపై స్పందించారు.

పిఎం ఆవాస్ యోజన సగం కూడా పూర్తికాలే..

- నిర్మాణం మొదలుకాని ఇళ్లు గ్రామాల్లో 84 లక్షలు..పట్టణాల్లో 59 లక్షలు..
- 2022కల్లా అందరికీ పక్కా ఇళ్లు కట్టిస్తామన్న మోడీ సర్కార్
- ప్రతి రాష్ట్రంలోనూ పెద్దఎత్తున ప్రచారం..రాజకీయ లబ్ది

న్యూఢిల్లీ : 2022 కల్లా దేశంలో ఇళ్లులేని పేదలందరికీ పక్కా ఇళ్లునిర్మించి ఇస్తామని 2014 సార్వత్రిక ఎన్నికల్లో మోడీ, బిజెపి దేశ ప్రజలకు వాగ్దానం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 2.94 కోట్ల పక్కా ఇళ్లు కట్టబోతున్నామంటూ మోడీ వివిధ రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇళ్ల నిర్మాణ పథకాన్ని రాజకీయ ప్రయోజనానికి వాడుకోవటంలో ఉన్న ఆసక్తి, లక్ష్యాన్ని పూర్తిచేయటంలో లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమది డబుల్ ఇంజన్ ప్రభుత్వమని చెప్పుకుంటున్న బిజెపి పాలిత రాష్ట్రాల్లోనూ ఆవాస్ యోజన నత్తనడకను తలపిస్తోంది.

ఉదాహరణకు ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి వారి సంకీర్ణ కూటములే అధికారంలో ఉన్నాయి. ఇక్కడ కేంద్రం తన వాటాగా 90శాతం నిధులు ఇవ్వాలి. అయినా ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్లు లేని పేదలకు న్యాయం జరగటం లేదు. తెలంగాణలో ఈ పథకం అమల్లో లేదు. తమ రాష్ట్రంలో 18.2శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని ఆంధ్రప్రదేశ్ తెలిపింది. గోవాలో 8శాతం, ఛత్తీస్‌గఢ్, హర్యానా, ఒడిషా, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, పంజాబ్, ఉత్తరాఖండ్‌లలో ఇళ్ల నిర్మాణ పథకం జాతీయ సగటు 72శాతం కన్నా తక్కువగా ఉంది.

పేరు మార్పులో ఉన్న శ్రద్ధ ఇళ్ల నిర్మాణంలో కరువు

ఇళ్ల నిర్మాణ పథకం తమ ఘనతగా మోడీ సర్కార్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంది. పథకానికి అప్పటివరకూ ఉన్న 'ఇందిరా ఆవాస్ యోజన' పేరును పిఎం ఆవాస్ యోజనగా మార్పు చేసి, కొత్త పథకంగా ప్రచారం చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 2.94 కోట్ల పక్కా ఇళ్లు నిర్మిస్తామని అధికారిక వెబ్‌సైట్‌లో కేంద్రం పేర్కొంది. ఈ సమాచారం ప్రకారం, జనవరి 6, 2023నాటికి 2.10 కోట్ల గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంకా 84 లక్షల ఇళ్లను నిర్మించాల్సి ఉంది. వీటి నిర్మాణంలో కనీసం పునాది కూడా పడలేదు. ఇక పట్టణ ప్రాంతాల్లో అయితే కేంద్రం ప్రకటించిన లక్ష్యంలో 51శాతం మాత్రమే పూర్తయింది. పట్టణ ప్రాంతాల్లో 1.25 కోట్ల గృహాలు కడతామని ప్రకటించగా, ఇందులో 61.19 లక్షల యూనిట్ల నిర్మాణం పూర్తయ్యింది. దీనినిబట్టి ఇంకా ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సినవి 59 లక్షలున్నాయి.

పేదల ఆశలపై నీళ్లు

ఎనిమిదేళ్లలో లక్ష్యాన్ని చేరుకోవటంలో కేంద్రం దారుణంగా విఫలమైందని గణాంకాలే చెబుతున్నాయి. దాంతో ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం లక్ష్యాన్ని మార్చి 2024కు పొడిగించారు. ఆవాస్ యోజన (పట్టణ) పథకం లక్ష్యాన్ని డిసెంబర్ 2024కు పొడిగిస్తూ గతంలో కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. నిజానికి క్షేత్రస్థాయిలో ఉన్న డిమాండ్‌కు కేంద్రం ప్రకటించిన లక్ష్యానికి పొంతనలేదు. అయినప్పటికీ ఆ లక్ష్యాన్ని సైతం చేరుకోవటంలో కేంద్రం దారుణంగా విఫలమైంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఆవాస్ యోజన (గ్రామీణ)కు నిధులు మంజూరు చేస్తున్నారు.

రోజు కూలీ రూ.90

గ్రామీణ ప్రాంతాల్లో ఒక ఇంటి నిర్మాణానికి కేటాయించిన మొత్తం రూ.లక్షా 20 వేలు. కొండ ప్రాంతాల్లో ఇది రూ.లక్షా 30వేలు. ఇంటి నిర్మాణంలో పాలుపంచుకున్న కూలీలకు రోజు కూలీగా రూ.90 ఇవ్వాలని నిబంధనలు రూపొందించారు. ఒక యూనిట్‌కు అయ్యే ఖర్చును కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం భరించాల్సి ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లో 90శాతం కేంద్రం, 10శాతం రాష్ట్రం తమ వాటాగా నిధులు విడుదల చేయాలి. ఇక ఆవాస్ యోజన (పట్టణ) పథకాన్ని గృహ నిర్మాణం, పట్టణ సంబంధాల శాఖ కింద అమలుజేస్తున్నారు. దీంట్లో మళ్లీ నాలుగు కేటగిరీలున్నాయి. 2011 సామాజిక, ఆర్థిక, కుల గణాంకాల్లో వెలువడ్డ వివరాల్ని పరిగణలోకి తీసుకొని ఆవాస్ యోజన పథకాన్ని కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది.

2011-22 మధ్యకాలంలో దేశ జనాభా ఎంతో పెరిగింది. ఇండ్లు లేని పేదల సంఖ్య భారీగా ఉంది. మట్టి గోడలతో, రేకులతో ఏళ్లుగా కష్టాలు పడుతున్న పేద కుటుంబాలు ప్రభుత్వం తమకు ఏదైనా సాయం చేయకపోతుందా? అని ఎదురుచూస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న డిమాండ్‌కు ప్రభుత్వం కడతామని ప్రకటించిన 2.94 కోట్ల ఇళ్లుఏమాత్రమూ సరిపోదని, ప్రకటించిన వాటినీ సమయానికి పూర్తిచేయకపోవటం దారుణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు అవినీతి, ఆశ్రిత పక్షపాతం ఆవాస్ యోజన పథకాన్ని దారుణంగా ప్రభావితం చేస్తున్నాయన్న విమర్శలున్నాయి.

ఢిల్లీ గజ గజ..

- 1.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

న్యూఢిల్లీ : ఉత్తర భారతదేశంలో చలి తీవ్రత రోజురోజుకూ ఉధృతమవుతోంది. దేశ రాజధాని ఢిల్లీ, ఈశాన్య రాష్ట్రాలు శీతల గాలులతో వణికిపోతున్నాయి. ఢిల్లీలో దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రత 1.9 డిగ్రీలకు పడిపోయినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఆదివారం తెలిపింది. మరో మూడు నాలుగు రోజులు ఇదే పరిస్థితి కొనసాగనుందని పేర్కొంది. ఢిల్లీలోని ఆయా నగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 2.6 డిగ్రీలుగా నమోదు కాగా, లోధి రోడ్‌లో 2.8 డిగ్రీల సెల్సియస్, పాలంలో 5.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు ఐఎండి వెల్లడించింది. వెలుతురు తగ్గడంతో, విమానాలు, రైళ్ల షెడ్యూల్ ఆలస్యమైనట్లు అధికారులు తెలిపారు.

20 విమానాలు, 42 రైళ్ల రాకపోకలు ఆలస్యం

20 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని ఢిల్లీ ఇందిరాగాంధీ విమానాశ్రయ అధికారులు తెలిపారు. పొగమంచు కారణంగా 42 రైళ్లు గంట నుండి ఐదు గంటల ఆలస్యంగా నడుస్తున్నాయని ఉత్తర రైల్వే ప్రతినిధి తెలిపారు. మరోవైపు గాలినాణ్యత సైతం ప్రమాదకర స్థాయిలో ఉంది. గాలి నాణ్యత సూచీ 359గా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్న నేపథ్యంలో నిరాశ్రయుల కోసం ఢిల్లీ ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. పంజాబ్‌లోని అమృత్‌సర్, పాటియాలా, అంబాలా, చండీగఢ్, రాజస్థాన్‌లోని గంగానగర్‌లో చలితీవ్రత అధికంగా ఉంది. భారత్ - గంగా మైదానాల మీదుగా తేలికపాటి గాలులు, అధిక తేమ కారణంగా ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోందని ఐఎండి పేర్కొంది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, బీహార్, పశ్చిమబెంగాల్, సిక్కిం, అస్సాం, త్రిపురలలో చాలా దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

ఉత్తరాదిలో యాత్రకు భారీ స్పందన

రాహుల్‌గాంధీ

కురుక్షేత్ర : దక్షిణాదిలో పోలిస్తే ఉత్తరాది రాష్ట్రాల్లో 'భారత్ జోడో యాత్ర'కు మంచి స్పందన వచ్చిందని కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఉత్తరాదిలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హర్యానా కురుక్షేత్రలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర భయం, ద్వేషం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి వాటికి వ్యతిరేకమని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు, హిందీ బెల్టులో యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రజా స్పందన ఉండదన్న కొందరి అభిప్రాయాలకు భిన్నంగా ప్రజామద్దతు లభిస్తోందని చెప్పారు. యాత్ర మహారాష్ట్రకు చేరుకున్నప్పుడు దక్షిణాదితో పోలిస్తే మెరుగైన స్పందన వచ్చిందన్నారు. మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో బిజెపినే అధికారంలో ఉందని అక్కడ కూడా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని చెప్పారు. రైతులు, పేద ప్రజలను ఆదుకునే ప్రభుత్వాలు ఈ రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బిజెపి దేశంలో ప్రజలను మతం ప్రాతిపదికన విభజించి విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ గతంలో ఇలా ఎప్పుడైనా చేసిందా..? అని ప్రశ్నించారు. ఇంధన ధరలు, ఎగుమతి విధానం, బీమా ధరలు, ఎరువుల ధరలతో దేశంలో అన్ని వైపుల నుంచి రైతులపై దాడులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ దేశాన్ని ప్రేమిస్తుందని.. మేము మా ప్రజలకు, రైతులకు, పేదలకు ప్రేమ పంచుతామని.. వారితో కలిసి నడవాలని అనుకుంటున్నామని అన్నారు. దేశంలో కొంతమంది మాత్రమే సంపద, మీడియా ఇతర సంస్థలను నియంత్రిస్తున్నారని విమర్శించారు.

మీకోసం

కొబ్బరినూనెలో ఉసిరి ముక్కలు వేసి మరిగించి, నూనె చల్లారాక తలకు పట్టిస్తే జుట్టు రాలే సమస్య తగ్గుతుంది.

జీవన సౌరభం

ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఆత్మవిశ్వాసమే ప్రధమ సోపానం.

మన బంగారు దేశం

ఓ సారి మా తోటలో కెళదామా
ప్రకృతిని పరిసరాల్ని వీక్షిద్దాం
అనంతానందం పొందుదాం
ఆడుతూ పాడుతూ గడిపేద్దాం
రామచిలుకల్ని ఉడుతల్ని
చిన్నికొలను బాతుల్నీ
ఎగిరే పక్షిరాజాల్ని
రంగురంగుల సీతాకోకచిలుకల్నీ
కనులవిందుగా చూసేద్దాం
పూవుల్లాగా స్నేహపరిమళాల్ని
ఇచ్చిపుచ్చుకుందాం
మనసు మనసు కలిసే
మాటల మూటల్ని విప్పేద్దాం
కులమతాలకు అతీతంగా మానవత్వం
ప్రదర్శిద్దాం
రేపటి పౌరులమైన మనం
దేశభక్తి కలిగివుందాం
పరులహితం కాంక్షిద్దాం
మన బంగారు దేశాన్ని
మనసారా కీర్తిద్దాం

- డా చిట్యాల రవీందర్
77988 91795



సరైన నీడ ఏది?

చిన్నారులూ, ఇక్కడ పిల్లి ఒకటి ఉంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.

జవాబు: 4

నేను గీసిన బొమ్మ

జి. రిశ్విక, 6వ తరగతి, రాయిలాపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విరామం లేని విజయం



సామాన్య కుటుంబంలో ఆడపిల్లగా పుట్టి క్రీడల్లో రాణించడం అంటే సాధారణమైన విషయం కాదు. అందులోనూ సాహస క్రీడలంటే మరింత కష్టం. జూడో, కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి సంఘవి ఆ కోవకే చెందుతారు. చిన్నప్పటి నుంచీ తనకు ఆటలంటే ఇష్టం. ఆర్థిక పరిస్థితులు, మధ్య తరగతి ఆలోచనలు అవరోధాలుగా నిలిచినా దాటుకుంటూ ముందుకెళ్లారు. పెళ్లి, పిల్లల తర్వాత మళ్లీ ఆటల్లో పాల్గొని అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా ఆగలేదు. అకాడమీ స్థాపించి ఎంతో మంది పిల్లలకు శిక్షణ ఇస్తూ, తానూ ఆడుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

కృష్ణా జిల్లా నూజివీడుకు చెందిన సంఘవికి చిన్నప్పటి నుంచి ఆటలంటే ఎంతో ఇష్టం. మైదానంలోనే గంటల తరబడి ఉండేది. ఆ పట్టుదల గమనించిన పీఈటీ రామలక్ష్మి పిలిచి కబడ్డీలో శిక్షణ ఇచ్చారు. దాంతో సంఘవి జిల్లా, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆడి బంగారు పతకాలు సాధించింది. మెరుగైన తర్ఫీదు కోసం ప్రధానోపాధ్యాయుడి సహాయంతో కోచ్ అంజిబాబు నడిపే జంక్షన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో చేరింది.

3 గంటలకు నిద్ర లేచి ...

ఉదయాన్నే 5 గంటలకు అకాడమీలో శిక్షణ ప్రారంభమయ్యేది. సంఘవి ఇంటి దగ్గర నుంచి అకాడమీకి వెళ్లటానికి ఉదయం 3 గంటలకు లేచేది. ఇంటి దగ్గర నుంచి ఏడు కిలోమీటర్లు సైకిల్ తొక్కి బస్సు అందుకునేది. ఇలా ఏడో తరగతి నుంచే శిక్షణ తీసుకుంది. ఓడిపోతుందని తెలిసినా సంఘవిని చేరిన మూడో రోజే కోచ్ అంజిబాబు టోర్నమెంట్‌కు తీసుకెళ్లారు. అక్కడ దెబ్బలు తగిలి, కళ్లు తిరిగి పడిపోయింది. అప్పటి నుంచి గెలవాలన్న కసి, పట్టుదల ఆమెలో పెరిగాయి. ప్రతిరోజూ కరాటే, బాక్సింగ్, జూడో, కుంగ్ ఫూలో పట్టుదలతో శిక్షణ తీసుకుని పలు పోటీల్లో పాల్గొంది. పోటీల్లో ఒంటినిండా దెబ్బలు, ముఖానికి గాయాలూ అయ్యేవి. అయినా 'నేను ఆడతా' అంటూ ముందుకు వెళ్లేది సంఘవి. ఒకసారి చెయ్యికి దెబ్బ తగిలింది. అయినా పోటీలో పాల్గొంటానంటూ నిర్వాహకులతో గొడవపడి మరీ బరిలోకి దిగింది. అలా కష్టపడి కరాటేలో బ్రౌన్ బెల్ట్ సాధించింది.

2010లో విశాఖపట్నంలో జరిగిన 17వ ఓపెన్ కిక్ బాక్సింగ్‌లో బంగారం పతకం, కోల్‌కతాలో జరిగిన టోర్నీలో సిల్వర్, గన్నవరం, హైదరాబాద్‌లో జరిగిన టోర్నీలో బంగారు పతకాలు సాధించింది. జాతీయస్థాయిలో 27 సార్లు కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని 12 బంగారు పతకాలు కైవశం చేసుకొంది. కబడ్డీ, కంగ్‌ఫూలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. బాక్సింగ్‌లో దక్షిణ కొరియాలో జరిగే అంతర్జాతీయ టోర్నీకి ఎంపికైంది. అయితే, దాతలు ఎవరూ ముందుకు రాక, ఇంట్లో ఆర్థిక పరిస్థితి సహకరించక ఆమె ఆ టోర్నీకి వెళ్లలేకపోయింది.

తర్వాతి కాలంలో ఇన్‌స్ట్రక్టర్‌గా గుర్తింపు సాధించి సొంతంగా అకాడమీ ప్రారంభించింది సంఘవి. విద్యార్థులకు శిక్షణ ఇవ్వటం మొదలు పెట్టింది. కొందరు బంధువుల నుంచి నిరుత్సాహపరిచే మాటలు ఎదురయ్యాయి. బంధువుల్లో ఒకరు ఓసారి ఆమె నిజంగానే బాక్సింగ్ ప్లేయరా? కాదా? అని పరీక్షించారు కూడా. ఒంటరిగా ఉన్నప్పుడు ఓ వ్యక్తి దాడి చేశాడు. అతడు పారిపోయేలా సంఘవి పిడిగుద్దులతో ఫైట్ చేసింది. ఆమె ఆటపట్ల పూర్తి నమ్మకం ఉన్న కుటుంబ సభ్యులు అన్ని విధాలా అండగా నిలిచారు. తండ్రి శ్రీరామంమూర్తి లారీ డ్రైవర్. తల్లి వరలక్ష్మి గృహిణి. సంఘవికి ఒక అక్క ఉంది.

భర్త సహకారంతో ...

సంఘవి డిగ్రీ సెకండీయర్‌లో ఉన్నప్పుడు తండ్రికి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆయన ఇంట్లోనే ఉండే పరిస్థితి. ఆ సమయంలో సాధారణ తండ్రి ఆలోచించే విధంగానే ఆయనా చేశారు. సంఘవి లక్ష్యం గురించి అడక్కుండానే గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన మెకానిక్ దుర్గా ప్రసాద్‌తో వివాహం జరిపించారు. ఒక బాబు పుట్టాడు. భర్త ఆమెలో ప్రతిభను గుర్తించి ఆటల్లో పాల్గొనమని ప్రోత్సహించాడు. దాంతో ఆమె దగ్గర్లో ఉన్న ఓ స్కూల్లో పిఈటీగా జాయిన్ అయ్యారు. అక్కడ పిల్లలకు స్కూలు అయిన తర్వాత కూడా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చి, టోర్నమెంట్లకు పంపేవారు.

పంచాయతీ సెక్రటరీ అయినా ...

లాక్‌డౌన్ సమయంలో ఖాళీగా ఉన్న ఆమె దగ్గరకు కరాటే నేర్పించమని ఓ స్నేహితురాలు తన కూతుర్ని పంపారు. వారిని చూసిన చుట్టుపక్కల వారూ తమ పిల్లల్ని పంపారు. దాంతో సుందరయ్య నగర్‌లో మార్షల్ ఆర్ట్స్ అకాడమీని సంఘవి ప్రారంభించారు. అప్పుడే ప్రభుత్వ ఉద్యోగాల ప్రవేశానికి పోటీ పరీక్ష రాశారు. దాంతో రామవరప్పాడులో పంచాయతీ సెక్రటరీగా ఉద్యోగం వచ్చింది. అయినా కోచింగ్ మానలేదు. ఉదయాన్నే పిల్లలకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ బాధ్యతలకు వెళుతున్నారు. తన విద్యార్థులతో పాటు తాను వివిధ టోర్నీల సీనియర్ల విభాగంలో బరిలోకి దిగుతున్నారు. ఇటీవల హనుమాన్ జంక్షన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో

బంగారు పతకం సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఎస్‌ఐ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఆమె ఒలింపిక్ క్రీడల్లో ఆడాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నారు.

- పద్మావతి

మా చిరునామా

రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక,
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రంగవల్లి



కొప్పర్తి స్వీటీ సలీనా
జంగారెడ్డిగూడెం

15 చుక్కలు 1 వచ్చే వరకు (సరి చుక్క)

బి వరలక్ష్మి, ఒంగోలు.

పోటెత్తిన 'చిరు' అభిమానులు

సందడిగా వాల్తేరు వీరయ్య ప్రీ రిలీజ్ వేడుకలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

మెగాస్టార్ చిరంజీవి, మాస్ మహరాజ్ రవితేజ హీరోలుగా మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నిర్మించిన వాల్తేరు వీరయ్య చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 13న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతున్న నేపథ్యంలో సినిమా ప్రీ రిలీజ్ వేడుకలను 'మెగా మాస్ పార్టీ' పేరుతో ఆదివారం సాయంత్రం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి చిరు అభిమానులు పోటెత్తారు. చిత్ర దర్శకుడు బాబీ మాట్లాడుతూ 2003 నుంచి 2023 వరకు కొనసాగిన తన సినీ ప్రస్థానంలో వాల్తేరు వీరయ్య సినిమా చాలా ప్రత్యేకమైనదన్నారు. చిరంజీవి అభిమానిగా తన ప్రస్థానం మొదలై చిరంజీవితోనే సినిమా తీసే స్థాయికి ఎదగడం ఎంతో ఆనందాన్నిస్తోందని తెలిపారు. చిరంజీవి నుంచి తాను ఎంతో నేర్చుకున్నానన్నారు. 94 రోజులపాటు నిర్విరామంగా షూటింగ్ చేశామని తెలిపారు. ఈ వేడుకల్లో సత్య మాస్టర్ బృందం డ్యాన్స్‌లు ఉర్రూతలూగించాయి. సుమారు 70 వేల మంది అభిమానులు ఈ వేడుకకు హాజరైనట్లు అంచనా. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సుమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. నిర్మాత నవీన్, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్, హీరోయిన్ కాథరిన్ థెరిసా, బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతాలా, కథా రచయిత కోన వెంకట్, ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్.ప్రకాశ్, స్క్రీన్‌ప్లే రైటర్ చక్రి, హాస్యనటులు షకలక శంకర్, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, చిరంజీవి కుమార్తెలు సుస్మిత, శ్రీజా, ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్‌లు, డ్యాన్స్ మాస్టర్ శేఖర్ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

విశాఖలో స్థిరపడడం నా చిరకాల కోరిక : చిరంజీవి

ప్రీ రిలీజ్ వేడుకల్లో హీరో చిరంజీవి ప్రసంగం ఆసక్తిగా సాగింది. ఎప్పుడు విశాఖ వచ్చినా ప్రతిసారీ ఉద్వేగానికి లోనవుతున్నానని, ఇక్కడి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుందని, ఇక్కడి ప్రజలు విశాలమైన మనస్సు ఉన్నవారని అన్నారు. ఇక్కడ ఒక హాలిడే స్పాట్‌గా భీమిలి వెళ్లే దారిలో ఒక స్థలం కొనుక్కున్నానని, త్వరలోనే ఇల్లు కట్టుకుని తాను విశాఖ వాసిని అవుతానని తెలిపారు. విశాఖలో స్థిరపడటం తన చిరకాల కోరికన్నారు. తన సినీ చరిత్రలో సూపర్ డూపర్ హిట్ సినిమాలన్నీ విశాఖలోనే షూటింగ్ జరుపుకున్నాయంటూ నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. బాబీ తనకు వాల్తేరు వీరయ్య కథ చెప్పగానే ఇది విశాఖతో ముడిపడి ఉన్న కథ అయినందున వెంటనే సరేనన్నానని తెలిపారు. సినిమా రూపొందించే క్రమంలో తను డైరెక్టర్ బాబీకి అభిమాని అయ్యానని చెప్పారు. చిత్రం ప్రారంభంలో వచ్చే రెండు ఎపిసోడ్లు హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని తెలిపారు. తెలుగు సినిమా చరిత్రలో రెండు పెద్ద చిత్రాలు ఒకే నిర్మాణ సంస్థ నుంచి ఒకేసారి విడుదల అవడం ఎంతో గొప్ప విషయమని, వాల్తేర్ వీరయ్యతోపాటు వీర సింహారెడ్డి కూడా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. రవితేజతో నటించడం ఆనందం కలిగించిందన్నారు. రవితేజ మాట్లాడుతూ చిరంజీవితో గతంలో తమ్ముడు, స్నేహితుడు పాత్రల్లో నటించానని, ఇప్పుడు పక్కన హీరోగా నటించానని తెలిపారు.

నిఖత్ అకాడమీకి స్థలం కేటాయించాలి

- పిసిసి అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి
- బాక్సర్ నిఖత్‌కు రూ.5 లక్షల ప్రోత్సాహకం

ప్రజాశక్తి -హైదరాబాద్ : అబ్బాయిలు ఆడే ఆట అని తల్లిదండ్రులు అడ్డుచెప్పలేదు. అడ్డంకులు ఎన్ని వచ్చినా ఆమె సాధన ఆపలేదు. కఠోర శ్రమతో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన తెలంగాణ ముద్ద నిఖత్ జరీన్ దేశానికి గర్వకారణమని తెలంగాణ పిసిసి అధ్యక్షుడు ఎనుమల రేవంత్ రెడ్డి అన్నారు. మహిళల ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్, ఇటీవల జాతీయ చాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకుంది. అంతర్జాతీయ స్థాయిలో పసిడి పతకం సాధించిన నిఖత్ జరీన్‌కు గతంలో రూ. 5 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నిజాం క్లబ్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో నిఖత్ జరీన్‌కు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రూ. 5 లక్షల నగదు ప్రోత్సాహకం అందజేశారు. 'నిఖత్‌జరీన్‌ను చాంపియన్‌గా తీర్చిదిద్దిన ఆమె కుటుంబ సభ్యులకు అభినందనలు. ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్ దేశానికి గర్వ కారణం. ప్రపంచ శ్రేణి సదుపాయాలతో అకాడమీ ఏర్పాటు చేసేందుకు నిఖత్ జరీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్థలం కేటాయించాలి. జనవరి 26 లోగా గ్రూప్-1 అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నాను. నిఖత్ జరీన్‌ను ప్రోత్సహించేందుకు ఈ నగదు బహుమానం అందించాం.

రాజకీయాలకు అతీతంగా ఉండాలనే నిజాం క్లబ్‌లో సన్మానం ఏర్పాటు చేశాం. క్రీడల్లో మాదిరిగానే రాజకీయాల్లోనూ క్రీడా స్ఫూర్తి అవసరం. లక్షలాది మంది క్రీడాకారుల్లో స్ఫూర్తి రగిల్చేందుకు నిఖత్ జరీన్‌కు మరో సన్మాన కార్యక్రమం నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు చొరవ తీసుకోవాలని' రేవంత్ రెడ్డి అన్నారు. సన్మాన కార్యక్రమంలో నిఖత్ జరీన్ తండ్రి జమీల్ అహ్మద్, హెచ్‌సిఏ మాజీ అధ్యక్షులు మొహమ్మద్ అజహరుద్దీన్ సహా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేసు రసవత్తరం

2023. ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఏడాది. అగ్ర జట్లు టైటిల్ ప్రణాళికలు మొదలు పెట్టేశాయి. కానీ 2023 మరో మెగా ఈవెంట్‌కు సైతం రంగం సిద్ధం చేసింది. అదే, ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్. ఈ ఏడాది జూన్‌లో జరుగనున్న ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు రసవత్తరంగా మారింది. రెండు ఫైనల్ బెర్తుల కోసం నాలుగు జట్లు పోటీపడుతున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు ఐదు రోజుల ఆటకు సరికొత్త ఉత్కంఠను తీసుకొచ్చింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకునే అవకాశాలు ఏ జట్టుకు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దామా!.

ప్రజాశక్తి క్రీడావిభాగం

రెండు బెర్తులు, నాలుగు జట్లు
ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్

ఆసీస్ అడుగేసిందా?! :

దక్షిణాఫ్రికాపై 2-0తో టెస్టు సిరీస్ గెలుపొందిన ఆస్ట్రేలియా.. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో దాదాపుగా అడుగుపెట్టేసింది. 10 టెస్టుల్లో విజయాలు సాధించిన కంగారూ జట్టు 75.56 గెలుపు శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియా ఆడటం దాదాపుగా ఖాయం. కానీ ఆస్ట్రేలియా సైతం ఫైనల్ బెర్త్ చేజార్చుకునే అవకాశాలు లేకపోలేదు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్‌కు నాలుగు టెస్టులనూ కోల్పోయి, అదే సమయంలో న్యూజిలాండ్‌పై శ్రీలంక సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే ఆస్ట్రేలియా అవకాశాలు గల్లంతు అవుతాయి.

భారత్ చేతిలో 0-4 సిరీస్ పరాజయం ఆస్ట్రేలియా పాయింట్ల/గెలుపు శాతాన్ని 59.65కు తగ్గిస్తుంది. ఇదే సమయంలో న్యూజిలాండ్ పర్యటనలో శ్రీలంక 2-0తో టెస్టు సిరీస్ నెగ్గితే లంకేయుల శాతం 61.11కు గణనీయంగా పెరుగుతుంది. అయితే, శ్రీలంక ఒక్క టెస్టులో నెగ్గి 1-0తో సిరీస్ నెగ్గినా ఆసీస్ ఫైనల్‌కు చేరుకుంటుంది. 1-0 విజయంతో శ్రీలంక శాతం 55.66కు రానుండగా.. ఆస్ట్రేలియా 0-4తో ఓడినా ఆ జట్టు శాతం శ్రీలంక కంటే మెరుగ్గా ఉంటుంది. ఇతర జట్లు, సమీకరణాలతో సంబంధం లేకుండా ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆసీస్ చేరుకోవాలంటే.. భారత్‌పై ఆ జట్టు కనీసం ఒక్క టెస్టునైనా డ్రా చేసుకోవాలి. ఇదే సమయంలో స్లో ఓవర్‌రేట్ కారణంగా పెనాల్టీ పాయింట్లకు గురి కావద్దు. ఓ టెస్టును డ్రా చేసుకుని 0-3తో భారత్‌కు సిరీస్‌ను కోల్పోయినా.. ఆస్ట్రేలియా శాతం 61.40గా ఉండనుంది. అప్పుడు శ్రీలంక 2-0తో కివీస్‌పై క్లీన్‌స్వీప్ చేసినా ప్రయోజనం ఉండదు. భారత్, ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ ఫైనల్లో తలపడతాయి.

భారత్ ఏం చేయాలి?! :

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకునే క్రమంలో భారత్ కఠిన సవాల్ ఎదుర్కొంటుంది. భారత్ ఇంకో నాలుగు టెస్టులు ఆడాల్సి ఉంది. ఈ నాలుగు టెస్టుల్లో కేవలం ఒక్క టెస్టులోనే భారత్ ఓడినా.. ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. రెండు మ్యాచుల్లో ఓడితే అప్పుడు ఇతర సమీకరణాలు తెరపైకి రానున్నాయి. ఆస్ట్రేలియాపై 3-1తో సిరీస్ విజయం సాధిస్తే.. ఇతర జట్లు, సిరీస్ ఫలితాల ప్రభావం లేకుండా నేరుగా ఫైనల్‌కు చేరుకోగలదు. బంగ్లాదేశ్‌పై 2-0 టెస్టు సిరీస్ విజయంతో భారత్ పాయింట్ల/గెలుపు శాతం 58.93కి చేరుకుంది. ఐసీసీ డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం రెండో స్థానంలో కొనసాగుతోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాపై భారత్ సిరీస్ ఫలితం ఆధారంగా టీమ్ ఇండియా పాయింట్ల శాతం ఇలా ఉండనుంది. 4-0 విజయంతో 68.06, 3-1 విజయంతో 62.5, 2-2 డ్రాతో 56.94 శాతంగా ఉండనున్నాయి. భారత్, ఆస్ట్రేలియా సిరీస్ 2-2 డ్రాగా ముగిసి, న్యూజిలాండ్‌పై శ్రీలంక 2-0తో నెగ్గితే భారత్ ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు దూరం కావాల్సి ఉంటుంది.

ఇక ఆస్ట్రేలియాతో సిరీస్‌లో భారత్ 21 పాయింట్ల కంటే తక్కువ సాధిస్తే దక్షిణాఫ్రికా కంటే వెనుకంజలో పడే ప్రమాదం ఉంది. దక్షిణాఫ్రికా సొంతగడ్డపై వెస్టిండీస్‌ను 2-0తో ఓడిస్తే.. భారత్ కష్టాల్లో పడనుంది. ఆస్ట్రేలియాతో సిరీస్‌ను భారత్ 1-0తో నెగ్గినా రోహిత్‌సేన 21 కంటే ఎక్కువ పాయింట్లు సాధించగలదు. దీంతో దక్షిణాఫ్రికా కంటే ముందంజలోనే నిలుస్తుంది. ఐసీసీ డబ్ల్యూటీసీలో ప్రతి టెస్టుకు 12 పాయింట్లు ఉంటాయి. విజయం సాధిస్తే 12, టై 6, డ్రా 4 పాయింట్లు లభిస్తాయి. ఆసీస్‌తో నాలుగు టెస్టులు డ్రాగా ముగిసినా భారత్‌కు ఎటువంటి ప్రయోజనం ఉండబోదు.

సఫారీ రేసులోనే ఉందా?! :

ఆస్ట్రేలియా చేతిలో 0-2 సిరీస్ పరాజయం దక్షిణాఫ్రికా అవకాశాలను దారుణంగా దెబ్బకొట్టింది. సిడ్నీ టెస్టు వాతావరణ పరిస్థితులు అనుకూలించక డ్రాగా ముగిసింది. లేదంటే, సిడ్నీ టెస్టులో ఓటమితో దక్షిణాఫ్రికా ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించేది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా పాయింట్ల శాతం 48.72. స్వదేశంలో ఆ జట్టు వెస్టిండీస్‌తో రెండు మ్యాచుల టెస్టు సిరీస్ ఆడాల్సి ఉంది. కరీబియన్లపై 2-0 విజయం సాధిస్తే దక్షిణాఫ్రికా గెలుపు శాతం 55.56కు చేరుకుంటుంది. ఇదే సమయంలో న్యూజిలాండ్‌పై శ్రీలంక ఒక్క మ్యాచ్‌లోనే నెగ్గాలి, లేదంటే శ్రీలంక సిరీస్‌ను వదులుకోవాలి. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో భారత్ పరాజయం లేదా 21 పాయింట్ల కంటే తక్కువ సాధించాలి. అప్పుడు దక్షిణాఫ్రికా ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోగలదు. సఫారీ జట్టు అవకాశాలు ఇతర సమీకరణాలపైనే పూర్తిగా ఆధారపడ్డాయి. వెస్టిండీస్‌పై క్లీన్‌స్వీప్ చేసిన ఇతర సిరీస్ ఫలితాల కోసం ఎదురుచూడాలి.

శ్రీలంక ఫైనల్‌కు వెళ్లగలదా? :

ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్ ఆరంభానికి ముందు ఐసీసీ డబ్లూటీసీ ఫైనల్ రేసులో శ్రీలంక లేదు. కానీ ఆసీస్, సఫారీ సిరీస్ ఫలితంతో శ్రీలంక అవకాశాలు మెరుగయ్యాయి. ప్రస్తుతం ఆ జట్టు మూడో స్థానంలో కొనసాగుతోంది. న్యూజిలాండ్‌తో సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేస్తే శ్రీలంక పాయింట్ల శాతం 61.11గా ఉంటుంది. ఇప్పుడు ఆ జట్టు ఇతర సమీకరణాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా, భారత్ సిరీస్‌లో ఫలితం లంకకు అనుకూలంగా రావాలి. ఆసీస్‌పై భారత్ 4-0 విజయం సాధించినా, లేదా భారత్‌పై ఆసీస్ సిరీస్ విజయం సాధించినా శ్రీలంక జట్టుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ సిరీస్‌లో సైతం కరీబియన్ జట్టు విజయం సాధిస్తే శ్రీలంక అవకాశాలు మరింత మెరుగవుతాయి. ఓవరాల్‌గా 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో రెండు జట్లకు మాత్రమే నేరుగా ప్రవేశం లభించే అవకాశం కనిపిస్తోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్, ఆస్ట్రేలియాలు ఇతర సమీకరణాలతో నిమిత్తం లేకుండా ఫైనల్‌కు చేరుకునే మార్గం ఉంది. దక్షిణాఫ్రికా, శ్రీలంకకు సైతం అవకాశాలు ఉన్నప్పటికీ.. పూర్తిగా వారి చేతుల్లోనే వంద శాతం చాన్స్ లేదు. అంతిమంగా ఐసీసీ 2023 డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్తులను మార్చిలో జరుగనున్న బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్ సమరం తేల్చనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68